

సరస్వతీ నమస్తుభ్యం

దేవీనవరాత్రుల్లో భాగంగా శుద్ధ సప్తమి మూలా నక్షత్రం నేపథ్యంలో అమ్మవారు సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు, విద్యార్థులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఏలూరు సత్రంపాడులోని సౌభాగ్యలక్ష్మీదేవి ఆలయంతో పాటు అయా ఆలయాల వద్ద విద్యార్థులు సామూహికంగా సరస్వతీ పూజలు నిర్వహించారు. సామూహిక అక్షరాభ్యాసాలు జరిపారు.



దరఖాస్తులు రీఓపెన్ కాకుండా చూడాలి

» కలెక్టర్ వెట్రిసెల్వి



ఏలూరు రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన దరఖాస్తులు రీఓపెన్ కాకుండా నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశపు హాలులో సోమవారం జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి 231 అర్జీలు అందాయి. డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, ఆర్డీవో ఎం.అచ్యుత అంబరీష్, ఎస్డీసీ దేవకీదేవి, ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం, ఆర్డీవో డీఆర్డీఏ పీడీ విజయరాజు, సర్వేశాఖ ఏడీ అన్సారీ, నగర పాలక సంస్థ కమిషనరు ఎ.భానుప్రతాప్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో 60 ఫిర్యాదులు



ఏలూరు క్రైం: ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని, ఆన్‌లైన్‌లో లోన్లు ఇప్పిస్తామని చెప్పి ముందుగా డబ్బులు కట్టమనే వారి మాటలు నమ్మవద్దని వారి పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ కేపీఎస్ కిశోర్ ప్రజలకు సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 60 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును విచారణ చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఏఎస్పీ సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

మళ్లీ పెరుగుతున్న గోదావరి



కుక్కునూరు గోదావరి తీరంలో వరద

వేలేరుపాడు/కుక్కునూరు/పోలవరం,సెప్టెంబరు29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాలు, ప్రాజెక్టుల నుంచి విడుదలవుతున్న నీటి వల్ల గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. తెలంగాణలోని భద్రాచలం వద్ద మంగళవారం సాయంత్రానికి 51 అడుగులకు చేరే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని జంగా రెడ్డిగూడెం ఆర్డీవో ఎం.ముక్కంటి అధికారులను ఆదేశించారు. వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో గోదావరి వరద పరిస్థితి సోమవారం స్వయంగా పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా రాకపోకలకు వీలుగా పడవలను సిద్ధం చేసి ఉంచాలని ఆదేశించారు. గోదావరి పరీవాహక ప్రాంతంలో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని, రైతాంగం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కుక్కునూరు తహసీల్దార్ రమేశ్‌బాబు ఆయన వెంట ఉన్నారు. ఇదిలా ఉండగా భద్రాచలం వద్ద గోదావరి వరద దోబూచులాడుతోంది. సోమవారం మధ్యాహ్నానికి 46.5 అడుగులుగా ఉన్న నీటిమట్టం సాయంత్రానికి అడుగు తగ్గి 45.5 అడుగులుగా నమోదైంది. అయితే మరో గంటలోనే నాలుగు అంగుళాల మేర పెరిగి 45.9 అడుగులుగా నమోదైంది. భద్రాచలం నుంచి దిగువకు 10 లక్షల క్యూసెక్కుల వరద దిగువకు ప్రవహిస్తుండడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. పోలవరంలో గోదావరి నీటిమట్టం తగ్గకపోవడంతో కడెమ్మ స్లూయిజ్ గేట్లు పూర్తిగా నీటమునిగాయి. పంటపొలాల్లో కొండవాగుల జలాలు గోదావరిలోకి వెళ్లే మార్గం లేక పంటపొలాలు నీటమునుగుతున్నాయి.

తగ్గేదేలే..?

కేంద్రం కరుణించినా దయచూపని వ్యాపారులు !

- » జీఎస్టీలో రెండు శ్లాబ్‌లు అమలులోకి వచ్చి వారం.. ఇంకా పాత ధరలకే పలు అమ్మకాలు
- » తగ్గని పాలు, మందుల ధరలు.. షాపుల్లో ఇవ్వని బిల్లులు.. జీఎస్టీ ఎంత తగ్గిందో తెలియక ప్రజల్లో అయోమయం
- » అమలుపై దృష్టి పెట్టాలంటున్న ప్రజలు
- » కార్లు, బైక్‌లు, టీవీలు, ఏసీలపై జీఎస్టీ తగ్గింపుతోపాటు దసరా ఆఫర్లు..
- » కొనుగోలుదారులతో షోరూమ్‌లు కిటకిట

- ఒక వ్యక్తి మందుల షాపునకు వెళ్లి 10 ట్యాబ్లెట్ల స్ట్రిప్ కొన్నాడు. దానిపై ఎంఆర్పీ రూ.335 ఉంది. తమ వద్ద ప్రత్యేక రాయితీ అంటూ రూ.284 తీసుకున్నారు. వినియోగదారుడు బిల్లు అడిగితే రూ.266కి ఇచ్చారు. ప్రశ్నిస్తే జీఎస్టీ తగ్గింపని సెలవిచ్చారు. ఒకవేళ బిల్లు తీసుకోకపోతే కొంత మేర నష్టపోయేవాడే కదా.
- మరో వ్యక్తి హార్లిక్స్ కొన్నాడు. ఎంఆర్పీపై ఏడు శాతం తగ్గించారు. అది తమ షాపులో మాత్రమే ఇచ్చే తగ్గింపని వ్యాపారి చెప్పాడు. జీఎస్టీ తగ్గింపుపై ప్రశ్నించగా.. ఆ స్టాకు పాత ఎంఆర్పీతో ఉందని తగ్గింపు రాదని సెలవిచ్చాడు. ఇది కేవలం ఆ ఇద్దరికి జరిగిన తంతు మాత్రమే కాదు. మందులపై చాలా మందికి జీఎస్టీ ఆదా పూర్తిస్థాయిలో చేకూరడం లేదు.

(పాలకొల్లు-ఆంధ్రజ్యోతి)

జీఎస్టీ 2.0 విధానం అమల్లోకి వచ్చి వారం దాటింది. ఈ నెల 22 నుంచి కేంద్రం పలు రకాల వస్తువులపై జీఎస్టీ శ్లాబ్ తగ్గించింది. నాలుగు శ్లాబ్‌ల నుంచి రెండు శ్లాబ్‌లకే పరిమితం చేసింది. 147 వస్తువులపై జీఎస్టీని తొలగించారు. 43 రకాల వస్తువులపై 28 నుంచి 18 శాతానికి, 12 నుంచి ఐదు శాతానికి జీఎస్టీ తగ్గింది. గతంలో 28 శాతంగా వున్న జీఎస్టీ పరిధిలోకి వచ్చే కొన్ని వస్తువులపై జీఎస్టీ 40 శాతానికి పెంచినప్పటికీ పలుచోట్ల పూర్తిస్థాయిలో అమల్లోకి రాలేదు. రోజూ కొనుగోలు చేసే కొన్ని కంపెనీల పాల ప్యాకెట్‌ల ధర ఇప్పటికి తగ్గలేదు. వైద్యానికి సంబంధించి అత్యవసర మందులు, వస్తువులపై కొత్త జీఎస్టీలో తగ్గింపులున్నా.. అమలు కావడం లేదు. పాత ఎమ్మార్పీవి అంటూ కొందరు మెడికల్ షాపుల వారు దోపిడీ చేస్తున్నారు. తగ్గిన జీఎస్టీ శ్లాబ్ వల్ల ప్రజలకు ఎప్పటికి ప్రయోజనం లభిస్తుందనే దానిపై స్పష్టత లేదు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పరిశీలనలో ఈ వాస్తవం వెలుగుచూశాయి. జీఎస్టీ అధికారులు దృష్టి సారించాలి.

ఆసుపత్రి మందుల షాపులపై

మందులపై జీఎస్టీని గణనీయంగా తగ్గినా చాలా ఆసుపత్రుల్లోని మందుల షాపుల్లో మాత్రం ప్రజల జేబుకు ఆదా కనబడడం లేదు. అధిక శాతం దుకాణాల్లో బిల్లులు ఇవ్వకపోవడంతో జీఎస్టీ తగ్గింపు తెలియడం లేదు. బిల్లులు ఇవ్వడం లేదు. ఉదాహరణకు అత్యవసర మందుల ధర రూ.5 వేలు అనుకొంటే గతంలో రూ.250-600 వరకూ జీఎస్టీ ఉండేది. ఇప్పుడు పూర్తిగా మినహాయించడంతో ఆ మేరకు తగ్గించాలి. కానీ ఆ లాభం వినియోగదారుడికి అందుతున్న దాఖలాలు కనిపించడం లేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వీటిపై డ్రగ్స్, వాణిజ్య పన్నుల శాఖల అధికారులు వీటిపై దృష్టి సారిస్తే చాలా వరకు సరుకుల ధరలు దిగి వస్తాయని ప్రజలు చెబుతున్నారు.

పాల ఉత్పత్తుల వద్ద ధరల పట్టికలు పెట్టారు. కానీ పాత సరుకు ఉందని చెబుతున్నారు. ఫలితంగా ధరలు తగ్గడం లేదు.

జీఎస్టీ తగ్గింపుతోపాటు దసరా ఆఫర్లు

పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లోని ప్రధాన పట్టణాల్లో వున్న షోరూమ్‌ల్లో టీవీలు, ఏసీలు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, కార్లు, మోటారు సైకిళ్లపై జీఎస్టీతో పాటు దసరా ఆఫర్లు ప్రకటించారు. ఫలితంగా కార్లపై రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ తగ్గగా బైక్‌లపై రూ.15 వేల వరకూ తగ్గింది. టీవీలపై రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకూ తగ్గిస్తున్నారు. కానీ ఇవన్నీ దసరా ఆఫర్లతో కలిపి అమ్ముతున్నట్టు చెబుతున్నారు. అంటే దసరా తర్వాత టీవీలు, ఏసీల వంటి ధరలు కొద్దిగా పెరిగే అవకాశం ఉంది. వాస్తవానికి పెద్ద షోరూంలను తట్టుకోవడానికి చిన్న వ్యాపారులు తంటాలు పడుతున్నాయి. ప్రజలు టీవీ, ఏసీ వంటి ఎలక్ట్రానిక్స్ వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు రెండు, మూడు షాపులలో సమాచారం సేకరించిన తర్వాతే కొనుగోలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో షోరూం యజమానులు వచ్చిన కస్టమర్‌ను సంతృప్తి పరిచే విధంగా వస్తువులను విక్రయిస్తున్నారు.



- **మారిన జీఎస్టీ.. పరిశీలించండి**

ప్రభుత్వం జీఎస్టీ శ్లాబ్‌ను తగ్గించిన 83 కేటగిరీల వస్తువులు, సేవలు వంటి వాటి వివరాలు ప్రకటించింది. వీటి ధరలు కచ్చితంగా తగ్గించాలి. పన్నీరు, టెట్రా ప్యాక్ పాలు, చపాతీలు, రోటీలపై వున్న ఐదు శాతం జీఎస్టీని పూర్తిగా ఎత్తేశారు. కాని, వ్యాపారులు పాత ధరలకే విక్రయిస్తున్నారు.

- పన్నీరు, టెట్రాప్యాక్ పాలు, చపాతీలు, రోటీలపై వున్న ఐదు శాతం జీఎస్టీ పూర్తిగా ఎత్తేశారు.
- వెన్న, నెయ్యి, తృణ ధాన్యాలు, చక్కెర, కాఫీ, సూప్‌లు, బేకింగ్ పౌడర్, నిల్వ ఉంచిన చేప మాంసంపై 12 నుంచి ఐదు శాతానికి జీఎస్టీ తగ్గించారు.
- 20 లీటర్ల తాగునీటి డబ్బాలు, కొబ్బరిపాలు, బాదం, జీడిపప్పు పాలు, అవిసె పాలు, బియ్యం పాలు, ఓట్ పాలు పండ్ల గుజ్జు, రసాలు, పాల ఆధారిత పానీయాలపై 18 నుంచి 5 శాతానికి తగ్గింది.
- వ్యవసాయ పరికరాలు, యంత్రాలపై గతంలో 12, 18 శాతం జీఎస్టీ ఉండేది.. వీటిని మొత్తం ఐదు శాతానికి తగ్గించారు.
- వాహనాలపై గతంలోవున్న 28 శాతం జీఎస్టీని 18 శాతానికి పరిమితం చేశారు.
- సైకిళ్లు, వాటి భాగాలపై 12 శాతం ఉంటే ఐదు శాతానికి పరిమితం చేశారు.
- సిమెంట్‌పై జీఎస్టీ 28 శాతం ఉంటే 18 శాతానికి పరిమితం చేశారు. మిగిలిన గృహ నిర్మాణ వస్తువులపై 12 శాతం ఉంటే 5 శాతానికి పరిమితం చేశారు.
- టీవీలు, ప్రొజెక్టర్లు, ఏసీలు, డిష్ వాషర్లపై గతంలో 28 శాతం జీఎస్టీ ఉంటే దానిని 18 శాతానికి పరిమితం చేశారు. సోలార్ వాటర్ హీటర్, సిస్టమ్స్ సోలార్ కుక్కర్లపై 12 శాతం ఉంటే 5 శాతానికి పరిమితం చేశారు.

జీఎస్టీ ఫలాలపై అవగాహన కల్పించండి : కలెక్టర్

ఏలూరు,సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ సంస్కరణల వల్ల ప్రజలకు జరిగే మేలును కిందిస్థాయి వరకు తీసుకెళ్లి మరింత అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై అధికారులతో కలెక్టర్ సోమవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అక్టోబరు 19 వరకు ప్రతీవారం ఒక అంశంపై జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వాణిజ్యపన్నులశాఖ, పంచాయతీ, రెవెన్యూశాఖ సమన్వయంతో వార్డు, సచివాలయాల పరిధిలో ఒక ఉద్యోగినిని నియమించాలని, కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జీఎస్టీ తగ్గింపుపై ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలపై ఏ మేరకు ఆదా ఉంటుందనే అంశంపై రవాణాశాఖ ముద్రించిన కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ బి.నాగార్జునరావు, ఉపరవాణా కమిషనర్ షేక్ కరీమ్ పాల్గొన్నారు.

నకిలీ మందులకు చెక్!

- » మందులకూ క్యూ ఆర్ కోడ్ అమలు
- » తొలివిడతగా 300 మందులపై..
- » దాడులు పెంచిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

ప్రజారోగ్యానికి చేటుగా గుట్టుచప్పుడు కాకుండా రాష్ట్రం సరిహద్దులు దాటి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో నకిలీ మందులు విచ్చలవిడిగా చెలామణి అవుతున్నాయి. కొన్ని ఫార్మా కంపెనీలు అసలుకు నకిలీ ఏమిటో గుర్తుపట్టని విధంగా మందులను తయారు చేసి గంపగుత్తగా తమ బ్రాండ్లను వదులుతున్నాయి. ఈ గుట్టును తేల్చేందుకు కేంద్రప్రభుత్వం తాజాగా మందులపైన క్యూఆర్ కోడ్ ముద్రణ తప్పనిసరి చేసింది. నకిలీ మందుల అమ్మకాలు అరికట్టేందుకు ఇప్పుడున్న ట్రాక్ అండ్ ట్రేస్ విధానంలో క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే మందుల వివరాలు ఇట్టే తెలిసిపోతాయి. ప్రతీ 100 మంది లో 60 మంది రోజువారీగా ఏదొక రూపంలో ఔషధాలను వినియోగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 250 హోల్‌సేల్, 1500 వరకు రిటైలర్లు దుకాణాలున్నాయి. 50కు పైగా ఆయుర్వేద మందుల దుకాణాలున్నాయి. వీటి పరిధిలో రూ.150 కోట్ల మేర వ్యాపారం సాగుతుంటుంది.



టాబ్లెట్ షీట్‌పై క్యూఆర్ కోడ్

కరోనా తర్వాత దేశ వ్యాప్తంగా కేంద్రం క్యూఆర్ కోడ్ అమలుకు 2022 నవంబరులో శ్రీకారం చుట్టింది. అయితే కొంతకాలం గడువు ఇవ్వాలని ఫార్మా రంగం ప్రముఖులు కోరడంతో కొంత కాలం వాయిదా పడగా, ఇటీవల క్యూఆర్ కోడ్ విధిగా అమలు చేయాలని ఆదేశాలందాయి. ఫోన్‌లో స్కాన్ ఓపెన్ చేసి క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే మందులపై ఉన్న పేర్లు, ముగింపు తేదీలు, అసలుదా? నకిలీదా అన్నది తెలిపోతుంది. యూనిక్ ప్రొడక్టు ఐడెంటిఫికేషన్ కోడ్, మందు జనరిక్ పేరు, బ్రాండు పేరు, లైసెన్సు నెంబరు కన్పిస్తాయి. ఒకవేళ ఔషధ ప్యాకింగ్‌పై బార్‌కోడ్, క్యూఆర్ కోడ్ లేకపోయినా వాటిని స్కాన్ చేస్తే వివరాలు కనిపించకపోయినా అవి నకిలివీగా గుర్తించాలని డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులు చెబుతున్నా రు.

దాడులు పెంచిన డ్రగ్స్ కంట్రోల్ అధికారులు

క్యూఆర్ కోడ్ ముద్రణ ఫార్మా కంపెనీలు తప్పనిసరి చేయడంతో డ్రగ్స్ కంట్రోల్ అధికారులు మందుల దుకాణాలపై దాడులు, తనిఖీలను ముమ్మరం చేశారు. క్యూ ఆర్ కోడ్ అమలు చేయకపోయినా, నకిలీ మందులు అమ్ముతున్నట్లు తేలినా, దీనిపై ఆయా షాపుల లైసెన్సులు **(మిగతా 8వ పేజీలో)**



16 కాదు.. 27 గంటలు

- » ఆ రైలు ఎక్కితే మైసూరుకు వెళ్లేందుకు పట్టే సమయం
- » నరసాపురం నుంచి పండుగ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు
- » తెలియక టిక్కెట్లు తీసుకుని లబోదిబోమంటున్న ప్రయాణికులు
- » చుట్టు తిరిగి వెళ్లడంతో అధిక సమయం

నరసాపురం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి):నరసాపురం నుంచి మైసూర్‌కు కొత్తగా రైలు వేయడంతో ప్రయాణికులు సంబరపడ్డారు. ఉదయం సికింద్రాబాద్‌కు, బెంగళూరుకు వెళ్లేందుకు సౌలభ్యంగా ఉంటుందని అంతా ఆనందపడ్డారు. ఈ సంతోషం మూడునాళ్ల ముచ్చటగా మారింది. కారణం ఈ రైలు చుట్టు తిరిగి వెళ్లడమే. తెలియక రిజర్వేషన్ చేయించుకున్న బెంగళూరు, మైసూర్ వెళుతున్న ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. నరసాపురం నుంచి బెంగళూరుకు వారంలో రెండు రైళ్లు నడుస్తున్నాయి. ప్రతి శుక్రవారం కాట్పాడి మీదుగా ఈ రైలు నడుస్తుంది. నరసాపురం నుంచి బెంగళూరుకు 16 గంటల ప్రయాణం. ఇది కాకుండా భీమవరం నుంచి శేషాద్రి ఎక్స్‌ప్రెస్ ఉంది. ఇది 15 గంటల్లో బెంగళూరు చేరుతుంది. వీటితోపాటు ఇటీవల కొత్తగా నరసాపురం నుంచి ప్రతి సోమ, శుక్రవారాల్లో బెంగళూరు మీదుగా మైసూర్‌కు 07033 నెంబర్‌తో పండుగ స్పెషల్ రైలు నడుపుతున్నారు. ఈ రైలు గుంటూరు, మిర్యాలగూడ, సికింద్రాబాద్, వికారాబాద్, తాండూరు, రాయచూర్, మంత్రాలయం, గుంతకల్, అనంతపురం, ధర్మవరం మీదుగా బెంగళూరు, అక్కడి నుంచి మైసూర్ వెళుతుంది. ఈ రైలు నరసాపురంలో ఉదయం 11.35కి బయలుదేరి మరుసటి రోజు ఒంటి గంటకు బెంగళూరు చేరుతుంది. అక్కడి నుంచి మైసూర్‌కు మరో మూడు గంటలు సమయం. అంటే ఈ రైలులో మైసూర్ వెళ్లాలంటే దాదాపు 27 గంటల సమయం పడుతుంది. విషయం తెలియక చాలా మంది టిక్కెట్లు బుక్ చేసుకుని లబోదిబోమంటున్నారు. ఈ రైలు ఉదయం సికింద్రాబాద్ వెళ్లేందుకు మాత్రమే ఉపయోగమని పెదవి విరుస్తున్నారు.

వైద్య ఆరోగ్యశాఖ డెమోగా శ్రీనివాసరావు నియామకం

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్యఆరోగ్యశాఖ డెమో (డిస్ట్రిక్ట్ మాస్‌ఎడ్యుకేషన్ మీడియా ఆఫీసర్)గా బి.శ్రీనివాసరావు పదోన్నతి, బదిలీపై జిల్లాకు నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి సౌరబ్ గౌర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాసరావు ప్రస్తుతం గుంటూరు రీజనల్ ట్రైనింగ్ (ఫిమేల్)సెంటర్‌లో హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (హెచ్‌ఈఈవో)గా పనిచేస్తున్నారు. కాగా వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ట్రైనింగ్ కేంద్రం (పీవోడీటీటీ)లో పనిచేస్తున్న కె.పి. చంద్రశేఖరరావును గుంటూరు జిల్లా నల్లపాడులోని ఆర్‌హెచ్ అండ్ ఎఫ్ డబ్ల్యూటీసీకి కమ్యూనికేషన్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు.

సరస్వతీ నమస్తుభ్యం



వీరంపాలెంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వీరంపాలెం బాలాత్రిపుర సుందరి పంచాయతన క్షేత్రంలో మేధా సరస్వతి అమ్మవారి సన్నిధిలో మూలానక్షత్రం సందర్భంగా సోమవారం సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఉదయం నుంచి విడతల వారీగా చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. పీఠాధిపతి గరిమెళ్ల వెంకట రమణ సిద్ధాంతి పర్యవేక్షించారు. అదేవిధంగా దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి శనివారం మహాగౌరి అలంకరణ చేశారు.

మావుళ్లమ్మ ఆలయం వద్ద..

భీమవరం టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రుల సందర్భంగా సోమవారం మూల నక్షత్రం పురస్కరించుకుని మావుళ్లమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో విద్యార్థులతో సామూహిక సరస్వతీ పూజలు చేయించారు. ఆలయ అర్చకుడు పూజలు చేయించారు. అనంతరం విద్యార్థులకు దేవస్థాన తరుపున పుస్తకాలు, విద్యా సామగ్రిని సహాయ కమిషనర్ బుద్ధా మహాలక్ష్మి నగేష్ అందించారు.

మహా సరస్వతీ దేవిగా కుంకుళ్లమ్మ

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): చదువులతల్లి శ్రీ మహాసరస్వతీ దేవి అలంకారంలో క్షేత్రదేవత కుంకుళ్లమ్మ సోమవారం భక్తులను అనుగ్రహించారు. శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో రోజుకో అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తున్నారు. మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని వీణాపాణియై, అక్షరమాలను ధరించి, అభయహస్తంతో కుంకుళ్లమ్మను పలువురు భక్తులు దర్శించారు.



తాడేపల్లిగూడెం బలుసులమ్మగుడిలో సామూహిక పూజలు చేస్తున్న విద్యార్థులు



సరస్వతి దేవిగా దర్శనమిచ్చిన ద్వారకాతిరుమల కుంకుళ్లమ్మ, జంగారెడ్డిగూడెం మూకాలమ్మ, కొయ్యలగూడెం కనకదుర్గమ్మ, పెనుగొండ వాసవీ మాత, పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరాలయంలో పార్వతి అమ్మవారు, ఏలూరు అంబికా దేవి, ఆకివీడు పెద్దింట్లమ్మ, భీమవరం మావుళ్లమ్మ

మల్లికార్జునుడిని తాకిన సూర్య కిరణాలు



ఏలూరు రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏలూరు రూరల్ మండలంలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిని సోమవారం సూర్యకిరణాలు తాకే అద్భుత దృశ్యాలు భక్తులకు కనువిందు చేశాయి. లేలేత సూర్యకిరణాలతో మల్లికార్జున స్వామి కాంతులీనారు. ప్రతీ ఏడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా స్వామివారిని సూర్యకిరణాలు తాకినట్లు ఆలయ ధర్మకర్తలు వివరించారు.

ద్వారకాతిరుమల మార్గం ఇలా..

జాతీయ రహదారిపై దేవస్థానం సూచిక ద్వారాలు



జాతీయ రహదారిపై ఆలయ సూచిక ద్వారం

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి క్షేత్రానికి వాహనాల్లో వచ్చే భక్తుల సౌకర్యార్థం జాతీయ రహదారిపై పోలసానిపల్లి వద్ద రెండు సూచిక ద్వారాలను దేవస్థానం ఏర్పాటు చేస్తోంది. సూచిక లేకపోవడం వల్ల వాహనాల్లో వచ్చే భక్తులు ద్వారకాతిరుమలకు వెళ్లే మార్గం తెలియక ముందుకు వెళ్లిపోతున్నారు. గమనించిన దేవస్థానం ఏలూరు నుంచి ద్వారకాతిరుమల వైపు వచ్చే ప్రాంతంలో ఒకటి, రాజమహేంద్రవరం నుంచి వచ్చే ప్రాంతంలో మరోటి సూచిక ద్వారాలను ఏర్పాటు చేశారు. దీనివల్ల ద్వారకాతిరుమల మార్గాన్ని భక్తులు సులువుగా గుర్తించే వీలుంటుందని ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి తెలిపారు. భక్తుల సేవార్థం అవసరం మేరకు ఇటువంటి పలు కార్యక్రమాలు నిరంతరం చేపడతామని ఆయన వివరించారు.



అవార్డు అందుకుంటున్న వెంపటాపు, వికసిత్ భారత్ 2047 చిత్రం

వికసిత్ భారత్ -2047 స్పాట్ పెయింటింగ్ పోటీలో రాష్ట్రస్థాయి బహుమతి విజేత వెంపటాపు

తణుకు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ విజయవాడ వారి నిర్వహణలో ఆదివారం నిర్వహించిన వికసిత్ భారత్ కె రంగ్ కళా కె సంగ్ అంశంపై రాష్ట్రస్థాయి స్పాట్ పెయింటింగ్ పోటీలలో తణుకు పట్టణానికి చెందిన చిత్రకారుడు వెంపటాపు వికసిత్ భారత్-2047 అనే చిత్రాన్ని చిత్రించిన దానికి ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. యోగి వేమన యూనివర్సిటీ ఫైన్ ఆర్ట్స్ హెచ్‌వోడీ కె.మృత్యుంజయరావు, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ డైరెక్టర్ రమేష్. అసిస్టెంట్ ప్రొఫెసర్ సంతోష్ నుంచి బహుమతి అందుకున్నట్లు వెంపటాపు చెప్పారు. ఐదువేల నగదు, ప్రశంసాపత్రం జ్ఞాపిక అందజేశారు. తణుకు, ఇరగవరం గ్రామాల ప్రముఖులు వెంపటాపును అభినందించారు.

ధాన్యం ట్యాంకర్లు..!



అప్పారావుపేటలో రోడ్డుపై ఉంచిన వరి కోత యంత్రాలు

ఆ యంత్రాలను చూడగానే జై జవాన్.. జై కిసాన్ నినాదం గుర్తుకొచ్చిందని పలువురు వ్యాఖ్యానించారు. రోడ్డుపై వరుసగా ఉన్న వాహనాలు చూసినపుడు సైనికులు యుద్ధ ట్యాంకర్లతో కదన రంగంలో దూకితే.. రైతన్న ధాన్యం ట్యాంకర్ (వరి కోత యంత్రం)తో సాగు భూమిలో దిగుతున్నట్లు ఉంది. తాడేపల్లిగూడెం మండలంలో వరి మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఒకే గ్రామంలో పదికిపైగా వరి కోత యంత్రాలతో మాసూళ్లు చేస్తున్నారు. అప్పారావుపేటలో వరి మాసూళ్లు పూర్తి చేసి మరో గ్రామం వెళ్లేందుకు సుమారు 15 వరి కోత యంత్రాలు రోడ్డుపై వరుసగా ఉంచారు. కోత యంత్రాలు కూడా చూడడానికి యుద్ధ ట్యాంకర్లను తలపిస్తాయి. అటు వైపు వెళ్లేవారు ఒకసారి ఆగి మరీ కోత యంత్రాలను ఆసక్తిగా తిలకించారు.

- తాడేపల్లిగూడెం రూరల్, (ఆంధ్రజ్యోతి)

ఆట, పాటల విజ్ఞానానికి సాక్షం



రౌండ్ టేబుల్ విద్యా బోధన



• చిన్నారులను అయస్కాంతంలా ఆకర్షించే అంగన్‌వాడీలు • ఆటలకు అందమైన పరికరాలు • బొమ్మలతో బోధన



ఆట పరికరాలతో చిన్నారుల సందడి



ఆట పరికరాలు, బొమ్మలతో విజ్ఞానం, టీవీలో నీతి కథలతో సాక్షం అంగన్‌వాడీలు చిన్నారులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. పౌష్టికాహారం అందించే కేంద్రాలుగా ఉన్న అంగన్‌వాడీలు ఒక్కసారిగా విజ్ఞాన కేంద్రాలుగా మారిపోయాయి. రౌండ్ టేబుల్‌పై బొమ్మల పుస్తకాలతో కుస్తీ, టీవీలో నీతి కథలపై శ్రద్ధ, ఆట పరికరాలతో సరదా వెరసి చిన్నారులు ఉత్సాహంగా వెళుతున్నారు. అంగన్‌వాడీ టీచర్లతో పాటు తల్లిదండ్రులకు ఆనందం.



చిత్ర మాలిక

భీమవరం రూరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): చిన్నారులకు పౌష్టికాహారంతోపాటు ఆహ్లాదకరమైన శిక్షణ ఇచ్చేందుకు అమలులోకి తెచ్చిన 'సాక్షం అంగన్‌వాడీలు' విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అంగన్‌వాడీలకు వెళ్లడానికి మారాం చేసే పిల్లలు సాక్షం అంగన్‌వాడీలకు ఉత్సాహంగా వెళుతున్నారు. ప్రభుత్వ ప్రయత్నం సత్ఫలితాలు ఇస్తోంది. పశ్చిమ గోదావరి జిల్లాలో 1626 అంగన్‌వాడీలున్నాయి. 489 కేంద్రాల్లో సాక్షం అంగన్‌వాడీ వస్తువులు అందించారు. వస్తువులు చిన్నారులకు ఆకర్షణగా నిలిచాయి. పిల్లలకు ఆటలు నేర్పించడం నుంచి టీవీలలో బొమ్మల చిత్రాలతో నీతి బోధనలు చెప్పడానికి టీచర్లకు వీలుగా మారింది. చిన్నారులకు ఉన్న సమయంలో వీటిని ఉపయోగించడానికి వీలుగా మారింది.

ప్లేస్కూల్‌కు దీటుగా

ప్రైవేట్ ప్లే స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ సాక్షం అంగన్‌వాడీలు మారాయి. పిల్లలను ప్లే స్కూళ్లకు పంపించడానికి ఏడాదికి రూ.20 వేల నుంచి రూ.లక్ష వరకు వెచ్చించాల్సి వస్తోంది. అంతకు మించి అంగన్‌వాడీ కేంద్రాలలో సాక్షం అంగన్‌వాడీలుగా సౌకర్యాలు రావడం చిన్నారుల తల్లిదండ్రులను ఆలోచనలో పడేలా చేశాయి. ఇప్పటికే చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్న అంగన్‌వాడీలలో ఆకర్షణగా నిలిచే వస్తువులు ఏర్పాటు చిన్నారులకు మరింత ఉపయోగంగా మారింది.

ఏడు రకాల వస్తువులు

సాక్షం అంగన్‌వాడీలలో ఏడు రకాల వస్తువులను ప్రభుత్వం అందించింది. ఎల్ఈడీ టీవీ ద్వారా కార్టూన్స్ చిత్రాలు పిల్లలకు చూపిస్తారు. ఆటలకు ఉపయోగించే జారుడు బల్ల, నల్లబోర్డు, టేబుల్, కుర్చీలు, ఐరన్ రాక్, ప్లేయింగ్ మ్యాట్, సీసా ఆట వస్తువులు, వాటర్ ప్లాంట్ అందుబాటులోకి తెచ్చారు.



సాక్షం అంగన్‌వాడీలో టీవీలో నీతి కథలను శ్రద్ధగా చూస్తున్న పిల్లలు

చిన్నారులకు శిక్షణ సులభతరం



సాక్ష్యం అంగన్‌వాడీ వస్తువులతో పిల్లలకు శిక్షణ వీలుగా మారింది. పిల్లలు ఆనందంగా అక్షరాలు, బొమ్మలు నేర్చుకుంటున్నారు. ఉత్సాహంగా ఆటలు ఆడుతున్నారు. టీవీ బొమ్మలు చూడడానికి ఆసక్తి కనబరుస్తున్నారు.

- సీహెచ్.మహాలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్, రాయలం

అంగన్‌వాడీకి మా పాప పరుగులు



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆకర్షణగా ఉండే వస్తువులు వచ్చాక మా పాప పరుగున వెళుతోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఉంటుంది. ప్రైవేట్ స్కూల్స్‌లో అయితే వేల రూపాయలు కట్టాలి.

- ఝాన్సీరాణి, తల్లి, రాయలం



ఏలూరు ఇండోర్ స్టేడియంలో జరిగిన అంతర జిల్లా అండర్-14 విభాగం బాలికల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో తలపడిన క్రీడాకారులు

వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ పశ్చిమ



టీం చాంపియన్ షిప్ సాధించిన పశ్చిమ గోదావరి జిల్లా జట్టు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అంతర జిల్లా అండర్-14 విభాగం బాలికల వెయిట్ లిఫ్టింగ్‌లో పశ్చిమ గోదావరి జిల్లా జట్టు చాంపియన్‌గా నిలిచింది. ఏలూరు ఇండోర్ స్టేడియంలో క్రీడా పోటీలను ఎమ్మెల్యే బడేటి చంటి సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, క్రీడాకారుల్లో ప్రతిభ పోటీల ద్వారా బయట పడుతుందని ఆయన అన్నారు.

రాష్ట్ర నలుమూలల బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా కేటగిరిల్లో పోటాపోటీగా తమ సత్తా చాటారు. 40 కేజీల కేటగిరిలో పి.జ్ఞాన పద్మావతి, 44 కేజీల కేటగిరిలో ఎం.పావని, 48 కేజీల కేటగిరిలో బి.సిరి చందన, 53 కేజీల కేటగిరిలో సీహెచ్ హారిక, 58 కేజీల కేటగిరిలో జి లెనిన్ ప్రియ, 63 కేజీల కేటగిరిలో కె.వెంకట లావణ్య, 69 కేజీల కేటగిరిలో ఎ.స్మిత వర్షిణి, ప్లస్ 69 కేజీల కేటగిరిలో ఎస్ ఆశాజ్యోతి ప్రథమ స్థానాల్లో నిలిచారు.

అండర్ - 14 పోటీల టీం ఛాంపియన్ షిప్‌ను పశ్చిమ గోదావరి జిల్లా జట్టు సాధించగా, గుంటూరు జిల్లా జట్టు రన్నర్‌గా నిలిచింది. బెస్ట్ లిఫ్టర్‌గా జి.లెనిన్ ప్రియ (కడప) ఎంపికైంది. ఏపీఎస్ ఆర్‌డీసీ చైర్మన్ బడేటి వెంకట్రామయ్య, టి.దీన్నాబాబు, కె.సర్వేశ్వరరావు, ఎం.సీతారామయ్య, సీహెచ్ మల్లికార్జునరావు, కె.రాజేశ్వరరావు, ఎం.రమేష్‌బాబు పోటీలను పర్యవేక్షించారు. సీనియర్ వెయిట్ లిఫ్టర్లు పాల్గొన్నారు.

విద్యతోపాటు ఆటలు ముఖ్యం

బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు



కుమారుడితో కలిసి బ్యాడ్మింటన్ ఆడుతున్న రఘురామకృష్ణరాజు

ఉండి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు ఆటలు ఎంతో ముఖ్యమని, దసరాకు బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. ఉండిలోని కలిదిండి అబ్బాయిరాజు జన్మ భూమి పార్కు బ్యాడ్మింటన్ కోర్టులో సోమవారం నియోజకవర్గ స్థాయి ఆయన ప్రారంభించారు. ఆయన కుమారుడు భరత్‌తో కలిసి కొద్దిసేపు బ్యాడ్మింటన్ ఆడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆసక్తిగల క్రీడాకారులంతా పోటీలో తలపడి నైపుణ్యం బయటకు తీయాలన్నారు. ప్రతిభ కనబరిచిన ఆటగాళ్లకు ప్రభుత్వం తగిన గుర్తింపు ఇస్తుందన్నారు. పోటీలో సుమారు 41 జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పాలకోడేరు బ్యాంక్ చైర్మన్ కొత్తపల్లి నాగరాజు, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లు కలిదిండి శ్రీనుబాబు, యడవల్లి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, యిర్రింకి బుజ్జి, కళ్లేపల్లి సతీష్‌రాజు, పేరిచర్ల బాల రాజు, కందుల బలరాం. గురుగుబిల్లి సత్యనారాయణ, పోలుబోతు రాము, కర్రి శ్రీను, మజ్జికృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పారా యోగాసనలో శ్రీనివాసరావు ప్రతిభ



గణపవరం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఈ నెల 26, 27, 28 తేదీల్లో జరిగిన జాతీయ పారా యోగాసన క్రీడల్లో గణపవరానికి చెందిన తుంగా శ్రీనివాసరావు ద్వితీయ స్థానం సాధించారు. సోమవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ తాను రజతం పతకం అందుకున్నట్లు తెలిపారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

12న ఏలూరులో రాష్ట్రస్థాయి పారా స్విమ్మింగ్ పోటీలు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏలూరులో వచ్చే నెల 12న రాష్ట్రస్థాయి పారాస్విమ్మింగ్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం క్రీడా పోటీల పోస్టర్ ఆవిష్కరించారు. బిశ్వనాథ్ భర్తీయ స్విమ్మింగ్ పూల్‌లో అక్టోబరు 12న పోటీలు ప్రారంభం అవుతాయన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన సిమ్మర్లు నవంబరులో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అవుతారన్నారు. పారా స్పోర్ట్స్ అసోసియేషన్ కన్వీనర్ యడ్లపల్లి సూర్యనారాయణ, కోచ్ బలగా గణేశ్, దివ్యాంగుల క్రికెట్ అంపైర్ నాగేంద్రసింగ్, క్రీడాకారులు బత్తిన నాగేశ్వరరావు, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పీహెచ్‌సీ వైద్యుల సమ్మె

ఏలూరు జిల్లాలో 101 మంది, పశ్చిమలో 80 విధులకు దూరం

నేడు డీఎంహెచ్‌వో కార్యాలయాల వద్ద నిరసన శిబిరం

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీ వైద్యాధికారుల ఉద్యమం తీవ్రరూపం దాల్చుతోంది. ఏలూరు జిల్లాలో 101 మంది, పశ్చిమలో 80 మంది మంగళవారం సమ్మెలో దిగనున్నారు. ఇప్పటికే పీహెచ్‌సీ వైద్యుల ఆందోళనతో సోమవారం చాలాచోట్ల రోగులకు ఓపీ వైద్య సేవలు అందలేదు. పీజీ వైద్యవిద్య ప్రవేశాల్లో ఇన్‌సర్వీస్ కోటా సీట్లను 30శాతం కొనసాగించేలా జీవో సవరించే వరకు సమ్మె విరమించేదిలేదని ఏపీ పీహెచ్‌సీల వైద్యుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ గంగాభవాని, డాక్టర్ షేక్ జోషిమా స్పష్టం చేశారు. డిమాండ్ల పరిష్కారానికి ఉన్నతాధికారులతో చర్చలు కొనసాగిస్తూనే పీహెచ్‌సీ వైద్యసేవలకు యథాతథంగా హాజరుకావాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు కోరారు. ఏలూరు జిలాలో మొత్తం 131 మంది వైద్యులకు 30మంది సమ్మెకు దూరంగా ఉంటామని స్పష్టం చేశారని వైద్యవర్గాలు వెల్లడించాయి. దశలవారీ ఆందోళనలో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటలకు ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద నిరసన శిబిరాన్ని ప్రారంభిస్తామని పీహెచ్‌సీల వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గంగాభవాని తెలిపారు. సోమవారం అన్ని పీహెచ్‌సీల్లో అత్యవసర కేసులు మినహా సాధారణ ఓపీ విధులను బహిష్కరించినట్లు తెలిపారు. వైద్యుల సమ్మె 100 శాతం విజయవంతంగా జరుగుతోందన్నారు. ప్రభుత్వంతో సంఘ రాష్ట్ర నాయకుల చర్చలు ఫలప్రదమవుతాయని ఆశిస్తున్నామన్నారు.

పశ్చిమలో 32 పీహెచ్‌సీలలో సేవలు బంద్

భీమవరం టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏపీపీహెచ్‌సీడీఏ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలో భాగంగా మంగళవారం నుంచి పీహెచ్‌సీ వైద్యులు సమ్మెలోకి వెళ్లనున్నారు. జిల్లాలో 32 పీహెచ్‌సీలలో 62మంది వైద్యులతో పాటు మిగిలిన వైద్యులతో కలిపి 80 మంది సమ్మెలో పాల్గొంటారు. మంగళవారం నుంచి అత్యవసర కేసులను కూడా చూడబోమని అన్ని సేవలు బంద్ చేస్తున్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు. తమ సమస్యలను సామరస్యంగా పరిష్కరించే అవకాశం ఉన్నా ఉన్నతాధికారులు స్పందించకపోవడం, ఎటువంటి మార్పులు ఉండవని స్పష్టం చెయ్యడంతో సమ్మె బాట పడుతున్నట్లు వారు ప్రకటించారు. భవిష్యత్ కార్యాచరణ చేపడతామని, ఆందోళన కార్యక్రమాలను కొనసాగిస్తామని వారు తెలిపారు.



రమాదేవిని అభినందిస్తున్న ట్రైకార్ చైర్మన్ బొరగం, టీడీపీ నాయకులు

విద్యా సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా

బాధ్యతలు స్వీకరించిన రమాదేవి

కొయ్యలగూడెం, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): ఏపీ విద్య, సంక్షేమ, మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా పెండ్యాల రమాదేవి నియమితులయ్యారు. విజయవాడలో సోమవారం ఆమె పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమెను ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, టీడీపీ నాయకులు అభినందించారు. ఆమె మాట్లాడుతూ విద్యాభివృద్ధి, మౌలిక సదుపాయాలకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తనకు పదవి ఇచ్చినందుకు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పారేపల్లి రామారావు, టీడీపీ నాయకులు నిమ్మగడ్డ రవీంద్ర, బొబ్బర చినరాజు, జాలం చాందిని, కాకి లక్ష్మి, ఆకుల అరుణ, రమ్య, బాలగంగాధర్ తిలక్, శేషారావు, పెద్దిరెడ్డి, మల్లూరి గోపి, తదితరులు వెళ్లారు.



ఏలూరు కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

బలవంతపు భూసేకరణ తగదు

ఆయుధ డిపో ఏర్పాటుపై ఆదివాసీ సంఘాల నిరసన

ఏలూరు రూరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెంలో నేవీ ఆయుధ డిపో పేరుతో బలవంతపు భూసేకరణ చేయడం తగదని ఆదివాసీ సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. ప్రజలు, గిరిజనుల ఆమోదం లేకుండా సర్వే ప్రక్రియ ప్రారంభించడం అన్యాయమని, రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు, ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. కలెక్టరేట్ వెట్రిసెల్విని కలిసి వినతిపత్రం అందజేశారు. 30 యాక్ట్, 144 సెక్షన్లు అమలు చేసి పోలీసులు చేస్తున్న నిర్బంధ చర్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల ఆమోదం మేరకే ముందుకెళ్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె శ్రీనివాస్, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎస్.రామ్మోహన్, బీకేఎంయూ జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వర రావు, తదితరులు మాట్లాడారు. ప్రజల అభిప్రాయాన్ని గౌరవిస్తామని చెప్పిన ప్రజాప్రతినిధులు మాట తప్పడం తగదన్నారు.

ఉద్యోగ సంఘ నాయకులపై కేసులు కొట్టివేత

గత ప్రభుత్వ హయాంలో కేసులు

ఆధారాలు లేవంటూ కేసు కొట్టేసిన స్పెషల్ మొబైల్ కోర్టు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగ సంఘ నాయకులపై గత ప్రభుత్వం పెట్టిన కేసులకు సరైన ఆధారాలు లేకపోవడంతో కేసును కొట్టివేస్తూ ఏలూరు స్పెషల్ మొబైల్‌కోర్టు సోమవారం తీర్పు చెప్పారు. సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్) ఉద్యమంలో పాల్గొన్న ఉద్యోగ సంఘ నాయకులపై గత ప్రభుత్వం 2022 ఆగస్టు 24న క్రిమినల్ కేసులను నమోదు చేసింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జేఏసీ నాయకులైన ఆర్ఎస్ హరనాథ్, చోడగిరి శ్రీనివాస్, ఉపాధ్యాయ సంఘాల జిల్లా నాయకులు షేక్ ముస్తఫ్ అలీ (యూటీఎఫ్) పువ్వుల ఆంజనేయులు (పీఆర్‌టీయూ), గగులోతు కృష్ణ (ఏపీటీఎఫ్ 1938), ఎం.ఆదినారాయణ (బీటీఎఫ్), కె.నాగేశ్వరరావు (ఏపీసీటీఎస్ఈఏ)పై కేసులు నమోదు చేశారు. మూడేళ్లుగా కోర్టు వాయిదాలకు హాజరవుతున్నారు. నేరం రుజువు కాకపోవడంతో కేసును కొట్టి వేస్తూ జడ్జి సోమవారం తీర్పు చెప్పారు. ఉద్యోగ సంఘ నాయకులు తరపున న్యాయవాదులు మాగంటి లక్ష్మణకుమార్, బి సోమయాజి, సత్యనారాయణ, మౌళి, రామకృష్ణ వాదించారు.



ఆకివీడు లాడ్జిలో రికార్డులు తనిఖీచేస్తున్న పోలీసులు

దొంగలొచ్చారు జాగ్రత్త...

- »రాజస్థాన్ ముఠా భయం.. »పగలు రెక్కీ.. రాత్రి చోరీ
- »అధునాతన సాంకేతికతతో దోపిడీలు
- »అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు
- »లాడ్జిలు, బస్టాండ్లు, వాహనాల ముమ్మర తనిఖీలు

ఉభయ గోదావరి జిల్లాల్లో రాజస్థాన్ దొంగల ముఠా సంచరిస్తోంది. నరసాపురం పోలీసులు ముఠా సభ్యుల ఫోటోలను కూడా విడుదల చేశారు. ఈ ముఠా తణుకు, ఏలూరు, నల్లజర్ల ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్టు సమాచారం. అయితే ఈ ముఠా పట్టణాల్లోని మారుమూల ప్రాంతాల్లోని లాడ్జిల్లో తలదాచుకుంటూ రాత్రి వేళల్లో తాళం వేసిన ఇళ్లల్లో తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్నట్టు సమాచారం.

(తాడేపల్లిగూడెం రూరల్/భీమవరం క్రైం-ఆంధ్రజ్యోతి)

రాజస్థాన్ దొంగల ముఠా అధునాతన సాంకేతికతను వినియోగించుకుని నగల దుకాణాలు, పెట్రోల్ బంకులు, ఏటీఎంలతోపాటు రెస్టారెంట్లలో భారీగా దోపిడీలకు పాల్పడుతున్నట్టు కేసులు నమోదయ్యాయి. ఇంటెలిజెన్స్ సమాచారంతో జిల్లాలోని పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. పోలీసులు అనుక్షణం నిఘా పెంచారు.

ఒంటరి వృద్ధులే లక్ష్యంగా..

ఒంటరిగా ఉన్న వృద్ధులను, మహిళలను లక్ష్యంగా చేసుకుని దుండగులు దోపిడీలకు పాల్పడుతున్నారు. ముందుగా రెక్కీ నిర్వహించి నగదు, బంగారు నగలు దోచేస్తున్నారు. ఇటీవల జిల్లాలో జరిగిన రెండు, మూడు దొంగతనాలతో పోలీసులు అప్రమత్తం అయ్యారు. జిల్లా ఎస్పీ సూచనలతో నిఘాను పెంచారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన దొంగల ముఠా రాష్ట్రంలో తిరుగుతూండటంతో పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

అమాయకుల్లా తిరుగుతూ..

ఆయా ప్రాంతాల్లో ఇల్లు అద్దెకు కావాలనో, తెలిసిన వారి కోసం వచ్చామని, ముందుగా పగటిపూట రెక్కీ నిర్వహిస్తారు. ఇంట్లో ఎవరుంటారో తెలుసుకుంటారు. అక్కా, చెల్లీ, అత్తా అంటూ వరసలు కలుపుతారు. తరువాత రెండు మూడు రోజులపాటు ఆ ప్రాంతాలల్లో తిరుగుతారు. ఆ నివాసాల్లో బంగారం, వెండి, నగదు ఎంత వరకు ఉంటుందో అంచనా వేస్తారు. తరువాత రాత్రిపూట ఇళ్ళకు వెళ్ళి తలుపు కొట్టి కత్తులు, రాడ్లు, చూపించి వారిని బెదిరించి అందిన కాడికి దోచుకు వెళ్తారు.

పెరిగిన బంగారం విలువే కారణమా?

ఇటీవల పెరుగుతున్న దొంగతనాలకు బంగారం విలువ పెరగడమే కారణంగా చెబుతున్నారు. బంగారం ధర రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో చోరీలు పెరుగుతున్నాయి. చాలామంది నిర్లక్ష్యంగా బంగారాన్ని ఇంట్లో ఉంచడం, ఏదైనా ఊరు వెళ్ళేటప్పుడు పోలీసులకు తెలియ పరచకపోవటంతో దొంగతనాలకు ఆస్కారం ఏర్పడుతోంది. లాక్డ్ హౌస్ మోనటరింగ్ సిస్టమ్ ఉన్నటికీ చాలా మంది వినియోగించుకోవటం లేదు.

దోపిడీలు ఇలా..

- తణుకులో ఓ వృద్ధురాలిని నలుగురు చంపుతామని బెదిరించి 50 కాసుల బంగారు ఆభరణాలు, రూ.70వేల నగదు దోచుకెళ్లినట్టు కేసు నమోదయింది. రాజస్థాన్ ముఠా ఆన వాళ్ల ఉన్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
- తాజాగా తాడేపల్లిగూడెంలోని కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద పార్క్ చేసిన స్కూటీలో రూ.3.80 లక్షలు ఉన్నట్టు గుర్తించి సొమ్ము కాజేశారు. దీనిపై కేసు నమోదైంది. నిందితుడిని సీసీ ఫుటేజ్ ఆధారంగా అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.
- ఏలూరు అశోక్‌నగర్ బ్రిడ్జి సమీపంలోని బిర్యాని పాయింట్‌లో రూ. 6 వేలను ఆదివారం రాత్రి దుండగులు అపహరించారు. బాధితుడి ఫిర్యాదుతో ఏలూరు టూటౌన్ సీఐ దర్యాప్తు చేస్తున్నారు.
- పెంటపాడు మండలం రావిపాడులో ఓ చోరీ చేసిన మోటారు సైకిల్‌ను వేసుకొచ్చిన ఇద్దరు వ్యక్తులు దుర్గమ్మ ఆలయంలో బంగారు ఆభరణాల చోరీకి యత్నించి లోపల గ్రిల్ ఓపెన్ కాకపోవడంతో వెను తిరిగినట్టు స్థానికులు సీసీ ఫుటేజిలో గుర్తించారు.
- భీమవరం పట్టణంలో ముగ్గురు యువకులు ఇల్లు అద్దెకు కావాలని వెళ్ళారు. ఇంట్లో ఎవరూలేని సమయం చూసుకుని ఆ వృద్ధులపై దాడి చేసిన బంగారం, వెండి దోచుకున్నారు.
- భీమవరం బలుసుమూడిలో ఇద్దరు వృద్ధ దంపతులు ఇంట్లో ఉన్నారని తెలుసుకుని ఇంట్లో చొరబడి నగదు దోచుకువెళ్ళారు.
- పాలకొల్లు పట్టణంలో ఏడాది క్రితం రాత్రి పూట ఇంట్లోకి చొరబడి కత్తులతో దాడిచేసి బంగారం, నగదు దోచుకుపోయారు.



తాడేపల్లిగూడెంలో వాహనాల తనిఖీ

ముమ్మర తనిఖీలు...

తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం, నరసాపురం తదితర పట్టణాల్లో ఈ రాజస్థాన్ ముఠా సంచరిస్తోందన్న అనుమానంతో పోలీసులు బస్టాండ్లు, రైల్వేస్టేషన్‌లు, లాడ్జిల్లో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమానితుల ఫోటోలు కూడా విడుదలవడంతో అప్రమత్తమయ్యారు. ఎక్కడ ఏ చిన్న చోరీ జరిగినా లోతుగా ఆరా తీస్తున్నారు.

ఆకివీడులో లాడ్జిల తనిఖీ..

ఆకివీడు: మధ్యప్రదేశ్, రాజస్థాన్‌కు చెందిన ముఠా దొంగతనాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ వి.జగదీశ్వరరావు, ఎస్ఐ హనుమంతు నాగరాజు అన్నారు. సోమవారం పట్టణ పరిధిలో లాడ్జిలు, వాహనాలు తనిఖీలు చేశారు. బస్టాండ్, రైల్వే స్టేషన్, బంక్‌లలో దొంగల పోటోలు అంటించి మాట్లాడారు. అనుమానాస్పదంగా ఎవరైనా తిరిగితే వెంటనే పోలీసులకు సమాచారం తెలియచేయాలన్నారు. ఇళ్ళలోని విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లో భద్రపరుచుకోవాలన్నారు.



అప్రమత్తంగా ఉండాలి..

రాజస్థాన్ ముఠా జిల్లాలో సంచరిస్తున్నట్టు ఇంటెలిజెన్స్ సమాచారం. దసరా సెలవుల నేపథ్యంలో తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నట్టు సమాచారం. అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం తెలపడంతోపాటు ఊళ్లకు వెళ్లే వారు విలువైన వస్తువులు ఇళ్లలో ఉండకుండా చూసుకోవాలి.

-బి. భీమేశ్వర రవికుమార్, సీఐ, తాడేపల్లిగూడెం రూరల్



దొంగతనాలపై ప్రత్యేక నిఘా

ఇటీవల పెరుగుతున్న దొంగతనాలపై ప్రత్యేక నిఘా ఉంచాం. రాత్రిపూట బీట్‌లను పెంచాం. ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలి. ప్రజలు ఊరు వెళ్లేటప్పుడు విలువైన వస్తువులను బ్యాంక్‌లో భద్రపరచుకోవాలి. లేని పక్షంలో ఎల్‌హెచ్‌ఎంఎస్ వినియోగించుకోవాలి.

-భీమవరం డీఎస్పీ జయసూర్య

7న విజయవాడలో ఫ్యాప్టో మహాధర్నా

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) ఆధ్వర్యంలో అక్టోబరు 7న విజయవాడలో నిర్వహించతలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని సోమవారం ఏలూరులో జరిగిన ఫ్యాప్టో సభ్య సంఘాల జిల్లా సమావేశంలో నాయకులు పిలుపునిచ్చారు. సమావేశం వివరాలను ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మోహన్, సెక్రటరీ జనరల్ ఆదినారాయణ మీడియాకు తెలిపారు. కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయాలని, ఏకీకృత సర్వీసు రూల్సు, కారుణ్య నియామకాలు, డీఎస్సీ-2003 టీచర్లకు పాత పెన్షన్ విధానం, 12వ వేతన సవరణ సంఘం ఏర్పాటు, రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లింపులు వంటి డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమానికి సమాంతరంగా తెలుగు మాధ్యమాన్ని కూడా కొనసాగించాలని కోరారు. విజయవాడలో నిర్వహించే మహాధర్నా తరువాత కూడా ప్రభుత్వం నుంచి స్పందనరాకపోతే రాష్ట్ర జేఏసీని కలుపుకుని ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు. ఫ్యాప్టో సభ్య సంఘాల జిల్లా నాయకులు వెంకటేశ్వరరావు, ప్రకాష్, రవికుమార్, రెడ్డిదొర, రమేష్, కాంతారావు, పవన్‌కుమార్, రామ్మోహన్, రామారావు, శ్రీనివాసరావు, హెచ్ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. మహాధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు.

యువతను మాదకద్రవ్యాల జోలికి వెళ్లనివ్వొద్దు : కలెక్టర్

ఏలూరు క్రైం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాల జోలికి పోకుండా చూడాలని జిల్లా కలెక్టర్ కె వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం మాదక ద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్య రహిత జిల్లాగా ఏలూరును రూపొందించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. మాదకద్రవ్యాలు కలిగి ఉన్నా, వినియోగం, రవాణా చేసే వారిపై క్రిమినల్ కేసులు తప్పవన్నారు. మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై ప్రతి పాఠశాల, కాలేజీలలోనూ పోస్టర్ల ద్వారా తెలపడంతోపాటు సమావేశాలు నిర్వహించి అవగాహన కలిగించాలని ఆదేశించారు. విద్యాలయాల్లో ఎవరైనా మాదక ద్రవ్యాలు సేవిస్తున్నా, పెడ్లర్స్ సమాచారాన్ని 1972 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చని, వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. నార్కోటిక్ డ్రగ్స్ విచ్చలవిడిగా విక్రయించకుండా ఔషధ దుకాణాలను తనిఖీ చేయాలన్నారు. అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల రవాణా, వినియోగంపై గట్టి నిఘా పెట్టామన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పిజె అమృతం, ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ ఆవులయ్య, విభిన్న ప్రతిభావంతుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామ్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ శారద, జిల్లా ప్రజా రవాణాధికారి షబ్నం, డీసీపీఓ సూర్యచక్రవేణి, విద్యాశాఖ సిబ్బంది భాస్కర్, ఈగల్ టీమ్ ఇన్‌ఛార్జి ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో ఎనిమిది మందికి రిమాండు

భీమడోలు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): భీమడోలులో ఒక వ్యక్తిపై దాడి చేసిన పది మందిలో ఎనిమిది మంది అల్లరి మూకలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భీమడోలులో గణపతి నిమజ్జనం సమయంలో గ్రామానికి చెందిన ఈతకోట రవికిరణ్ అనే వ్యక్తిపై కొందరు దాడి చేసి గాయపర్చడంతో అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం యువకులు స్టేషన్ నుంచి బెయిల్‌పై బయకు వచ్చారు. అప్పటి నుంచి ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో శనివారం రవికిరణ్‌పై యువకులు మళ్లీ దాడిచేసి గాయపర్చారు. బాధితుడి తలకు గాయమవడంతో ఆసుపత్రికి తరలించారు. మద్యం మత్తులో వరుసదాడులకు పాల్పడిన ఎనిమిది మందిని భీమడోలు సీఐ విల్సన్ అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ గ్రామస్తులు డిమాండ్ చేస్తూ ఉన్నతాధికారులు హామీ ఇవ్వాలంటూ పట్టుబట్టారు. దీనిపై డీఎస్పీ శ్రావణ్ కుమార్‌కి సమాచారమివ్వడంతో గ్రామస్థులకు నచ్చజెప్పారు. 10 మందిపై కేసు నమోదు చేయగా సోమవారం ఎనిమిది మందిని భీమడోలు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని కోర్టుకు తరలించగా రిమాండు విధించారు.



జైల్లో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న న్యాయమూర్తి శ్రీదేవి

చింతలపూడి సబ్ జైలు పరిశీలన

చింతలపూడి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ జైలును ఉమ్మడి జిల్లాల ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి సోమవారం చింతలపూడి సబ్ జైలును తనిఖీ చేశారు. నిందితుల కేసుల వివరాలు, వారికి అందిస్తున్న ఆహారం, తాగునీటి సౌకర్యాలపై ఆరా తీశారు. జైలు ప్రాంగణంలో ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని అవసరమైన వారు ఉపయోగించుకోవచ్చన్నారు. ఖైదీలకు అందిస్తున్న వంటను పరిశీలించారు. స్టోర్ రూమును తనిఖీ చేశారు. న్యాయమూర్తి వెంట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, జైలు సూపరింటెండెంట్ కృపానందం, బార్ అసోసియేషన్ సభ్యులు నాగేశ్వరరావు, వి. సుందరరావు, పట్నాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్లైడ్ గేటు మీద పడి ఏఎస్ఐ మృతి



జైపూర్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి):తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని జైపూర్ ఎస్టీపీపీలో సీఎస్ఎఫ్ ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న నరహరి శెట్టి అర్జున సారథి(56) స్లైడ్ గేట్ మీద పడి మృతి చెందినట్టు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. అర్జునసారథి ఎస్టీపీపీ అడ్మిన్ బిల్డింగ్ మెయిన్ గేట్ వద్ద ఆదివారం సెక్యూరిటీ విధుల్లో ఉన్నాడు. ఈ క్రమంలో గేటు మూస్తుండగా ఒక్కసారిగా స్లైడ్ గేటు మీద పడడంతో తోటి సిబ్బంది గేట్‌ను పక్కకు జరిపి అతన్ని గోదావరిఖని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అర్జునసా రథిది ఏలూరు జిల్లా కొప్పెర్ల గ్రామం అని తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పోలీసుల ఆత్మ స్థైర్యాన్ని దెబ్బతీయొద్దు

మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు వ్యాఖ్యలపై ఏఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పోలీసులపై అవాస్తవమైన, నిరాధారమైన వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు జిల్లా ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు హెచ్చరించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ, జిల్లా పోలీసు అధికారుల సంఘ జిల్లా అధ్యక్షుడు ఆర్.నాగేశ్వరరావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శానం రమేశ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ట్రెజరర్ బండారు నానిలు ఈ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, పోలీసు అధికారుల సంఘ అధ్యక్షుడు నాగేశ్వరరావులు మాట్లాడుతూ ఈ నెల 5న కైకలూరు పట్టణంలోని దానగూడెంలో రెండు సామాజికవర్గాలు మధ్య వినాయక చవితి నిమజ్జనంలో ఘర్షణలు చెలరేగాయని ఈ సంఘటనలో దానగూడెం గ్రామానికి చెందిన దళితులపై దాడి చేసిన సంఘటనపై పోలీసులు కేసులు నమోదు చేసి అరెస్టులు చేశారన్నారు. ప్రస్తుతం నిందితులు మచిలీపట్టణం జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్నా రన్నారు. ఈనెల 26వ తేదీన కైకలూరు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ఆయన ప్రాతి నిధ్యం వహించిన జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దాన గూడెం సంఘటనలో కైకలూరు రూరల్ సీఐ వీరా రవికుమార్‌పై వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేశారన్నారు. నోటికి వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదన్నారు. గతంలో ఎమ్మెల్యేగా పని చేసిన ఆయనకు ఎవరి అధికారాలు ఏమిటో తెలియకపోవడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. సీఐలను బదిలీలు చేసే అధికారం పోలీసు ఉన్నతాధికారులకే ఉంటుందని, ఎమ్మెల్యేలకు ఉండదన్నారు. పోలీసులపై మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలు పోలీసుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేవిలా ఉన్నాయని, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దానగూడెం సంఘటన జరిగిన సమయంలో పోలీసు అధికారులు యుద్ధ ప్రాతిపదికన సమయస్ఫూర్తితో వ్యవహరించి శాంతిభద్రతలను కాపాడారన్నారు. మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావుపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. సీఐ కృష్ణ మాట్లాడుతూ తనను సాధారణ బదిలీల్లో మాత్రమే బదిలీ చేశారని ఎవరి బలవంతంగా వీఆర్‌కు తరలించలేదని ఆయన స్పష్టం చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఏఎస్పీ సూర్యచంద్రరావు

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): భార్యపై కోపంతో ఒక వ్యక్తి కూల్ డ్రింక్‌లో ఎలుకల మందు కలుపుకుని తాగి తీవ్ర అస్వస్థతకు గురై ఏలూరు ఆంధ్రా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు కొత్తపేటకు చెందిన హంసల వెంకట సత్యనారాయణ(56) కు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్యతో తరచుగా గొడవలు పడుతూ ఉంటున్నాడు. గతంలో కూడా తాను చనిపోతానని ఒకసారి ఉరి వేసుకోవడం, మరోసారి పురుగు మందు తాగడం చేశాడు. అదే విధంగా గొడవపడి ఈ నెల 12వ తేదీన కూల్ డ్రింక్‌లో విషం కలుపుకుని తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అతనిని ఏలూరు ఆంధ్రా ఆసుపత్రిలో చేర్పించగా చికిత్సపొందుతూ సో మవారం మృతి చెందాడు. ఈసంఘటనపై ఏలూరు టూటౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ ఆధ్వ ర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైటెన్షన్ విద్యుత్ వైర్లు తగిలి ఒకరికి గాయాలు

ఏలూరు క్రైం,సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో ఒక వ్యక్తి తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఏలూరు పవర్‌పేటకు చెందిన రౌతు రమేశ్(42) తన కుటుంబ సభ్యులతో జీవిస్తున్నాడు. ఒక ఆసుపత్రికి సంబంధించిన ఫ్లెక్సీని ఏలూరు సీఆర్ఆర్ మహిళా కళాశాల వద్ద ఏర్పాటు చేస్తున్న సమయంలో పక్కనే ఉన్న హైటెన్షన్ విద్యుత్ వైరు తగిలి తీవ్ర గాయాలకు గురయ్యాడు. అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేయగా కుటుంబ సభ్యులు అతనిని ఏలూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ఎండిన చెట్టు పడి యువకుడి మృతి

పాలకోడేరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువకుడిపై ఎండిన చెట్టు పడటంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. పెనుమంట్ర మండలం మాముడూరుకు చెందిన పుల్లంపర్తి నరేశ్(28) భీమవరంలోని ప్రైవేటు హాస్పటల్లో పని చేస్తున్నాడు. అతని మిత్రులతో కలిసి నరేశ్ భీమవరం నుంచి వేండ్ర మీదుగా మాముడూరులోని ఒక శుభకార్యానికి సోమవారం బయల్దేరాడు. వేండ్ర డెల్టా పేపరు సమీపంలో ఎండిన ఓ భారీ వృక్షం ఒక్కసారిగా కుప్పకూలడంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి.. నరేశ్‌కు తీవ్ర గాయాలడంతో 108లో భీమవరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు స్నేహితులు తెలిపారు. చెట్టు కొమ్మలు ఆటోపై పడ్డాయి. వారంతా క్షేమంగా బయట పడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పాలకోడేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రెండు కార్లు నుజ్జునుజ్జు

నరసాపురం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో సోమవారం రాత్రి పెను ప్రమాదం తప్పింది. పాలకొల్లు మీదుగా మొగల్తూరు వెళ్తున్న లోడు లారీ మేదర్ల వంతెన వద్ద మెరక ఎక్కలేక టాక్సీ స్టాండ్‌లో పార్కింగ్ చేసిన కార్లు మీదకు దూసుకొచ్చింది. ఈఘటనలో రెండు కార్లు నుజ్జునుజ్జయ్యాయి. టాక్సీ స్టాండ్‌లో ఎవ్వరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బ్యాటరీ నుంచి మంటలు.. కారు దగ్ధం

భీమవరంక్రైం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): భీమవరంలోని ప్రభుత్వాసుపత్రి రోడ్డు సోమవారం ఉదయం వెళ్తున్న కారులో మంటలు చెలరేగడంతో కారు దగ్ధమైంది. కారు ముందు భాగంలో ఉన్న బ్యాటరీ నుంచి మంటలు వ్యాపించడంతో అందులో ప్రయాణిస్తున్న వారు దిగిపోవడంతో ఎవ్వరికీ ఏమీ కాలేదు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు.

ఆపరేషన్‌కు వెళితే ప్రాణాల మీదకొచ్చింది!

కుట్లు వేసిన చోట చీము పట్టడంతో బంధువుల ఆందోళన

ఏలూరు క్రైం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): శస్త్ర చికిత్స చేయించుకున్న మహిళకు కుట్లుపగిలి చీము పట్టడంతో బంధువులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేరే ఆసుపత్రికి వెళ్లి ప్రాణాలు కాపాడుకుంటామని వేడుకుంటున్నా వైద్యులు మాత్రం ససేమిరా ఎక్కడికి పంపించేది లేదని కరాకండీగా చెప్పడంతో మహిళ భయపడుతోంది. ఏలూరు ప్రభుత్వాసుపత్రి మాతాశిశు విభాగంలో సోమవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. లింగపాలేనికి చెందిన శిరీషను ప్రసవం నిమిత్తం ఆస్పత్రికి తీసుకురాగా శస్త్రచికిత్స చేసి బిడ్డను తీశారు. వారం తరువాత కుట్లు తీశారు. కుట్లు వేసిన చోట ఇన్‌ఫెక్షన్ సోకి చీము పట్టింది. వేరే ఆస్పత్రికి వెళ్తా మంటున్నా డిశ్చార్జి చేయమని అంటున్నారని బంధువులు ఆవేదన వ్యక్తం చేసింది. ఒక ప్రజా ప్రతినిధి జోక్యంతో బాలింతను ఆసుపత్రి నుంచి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు రాత్రి 10.30 గంటలకు డిశ్చార్జి చేయించారు. ఏలూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి కుటుంబ సభ్యులు ఆమెను తీసుకెళ్లారు. తమ తప్పును కప్పిపుచ్చేందుకు గైనిక్‌వార్డు వైద్యులు, సిబ్బంది శత విధాలా ప్రయత్నం కొనసాగిస్తూనే ఉన్నారు.



ఆపరేషన్ చేయించుకున్న బాలింత

ప్రజా సమస్యలను అసెంబ్లీలో చర్చించడం పట్ల హర్షం

ఏలూరు,సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఖాళీ స్థలాల పన్నులపై, 14 శాతం విధించడంపై ప్రజల తరపున సమస్యలను అసెంబ్లీలో విన్నవించిన ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి)కి విజయా గార్డెన్స్ అభివృద్ధి కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. స్థానిక హేలాపురి బ్రాహ్మణ సంఘం భవనంలో విజయాగార్డెన్స్ అభివృద్ధి కమిటీ సమావేశం అధ్యక్షుడు బీఎల్ నరసింహ రావు, ప్రధాన కార్యదర్శి శర్మ ఆధ్వర్యంలో జరిగింది. నగరంలో పేరుకుపోతున్న చెత్తను పూర్తిగా తొలగించాలని, ఖాళీ స్థలాలపై పన్ను తొలగించాలని ఈ సమావేశంలో కోరారు.

ఖరూర్ ఎన్‌డీఏ బృందంలో ఎంపీ మహేశ్

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం ఖరూర్‌లో ఇటీవల టీవీకే పార్టీ ర్యాలీలో తొక్కిసలాట జరిగి భారీగా ప్రాణనష్టం జరిగింది. ఈ దుర్ఘటనను సందర్శించి పరిస్థితులను పరిశీలించి ప్రాణనష్టం ఎలా జరిగిందని విషయాన్ని తెలుసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రతినిధి బృందం ఏర్పాటు చేసింది. బీజేపీ ఎంపీ హేమమాలిని కన్వీనర్‌గా 8మంది సభ్యులను ఈ టీమ్‌ను కేంద్రం నియమించింది. ఈ బృందంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్‌కు స్థానం కల్పించారు.

ఉచితంగా సీసీ టీవీ కెమెరా రిపేరు శిక్షణ

పెదపాడు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి):యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో అక్టోబరు 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు సీసీ టీవీ కెమెరా రిపేరుపై ఉచిత శిక్షణ నిర్వహించనున్నట్టు శిక్షణ సంస్థ డైరెక్టర్ ఎం. ఫణికిశోర్ తెలిపారు. 18-45 ఏళ్ల నిండిన స్త్రీ, పురుషులు అర్హులని, శిక్షణా కాలంలో ఉచిత శిక్షణతో పాటుగా వసతి, భోజనం ఉంటుందని, ఉచితంగా టూల్ కిట్ అందజేయడం జరుగుతుందన్నారు. శిక్షణ పూర్తిచేసిన వారికి బ్యాంక్ సర్టిఫికెట్‌తో పాటుగా ముద్ర రుణం మంజూరుకు సిఫార్సు చేయడం జరుగుతుందన్నారు. ఆసక్తిగలవారు 99485 65256, 95027 23561 నెంబర్లలో గాని, వట్లూరు ఐటీఐ పక్కన గల శిక్షణ కేంద్రం వద్ద గాని సంప్రదించాలని కోరారు.

ఏజెన్సీలో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయాలి

బుట్టాయగూడెం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాలైన బుట్టాయగూడెం, ఏలేరుపాడు, జీలుగుమిల్లి, పోలవరం మండల కేంద్రాల్లోను, ఆసుపత్రుల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీటీసీ ఎ.ఫ్రాన్సిస్ సోమవారం బుట్టాయగూడెం వచ్చిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ ఏడాది ఆగస్టు 9న సీఎం చంద్రబాబు ఏజెన్సీ మండలాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు ప్రకటించినా నేటికి అమలుకు నోచుకోలేదన్నారు. ఆదివాసీలు, ఇతర పేదలు వ్యయప్రయాసలకోర్చి మండల కేంద్రంలోని కార్యాలయాలకు వస్తున్నారని అటువంటివారికి క్యాంటీన్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. క్యాంటీన్ల ఏర్పాటుపై ప్రభుత్వంతో మాట్లాడతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఎంపీపీపై అవిశ్వాసం ప్రవేశపెట్టాలని వినతి

జీలుగుమిల్లి, సెప్టెంబరు(ఆంధ్రజ్యోతి): జీలుగుమిల్లి ఎంపీపీపై అవిశ్వాసం ప్రకటిస్తూ పలువురు ఎంపీటీసీలు సోమవారం జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయ ఏవోకు, ఎంపీడీవో టి.నిఖిల్‌మధుశరణ్‌కు వినతిపత్రం అందజేశారు. వైస్ ఎంపీపీ ఎస్.శ్రీనివాస్ మరో ఐదుగురు ఎంపీటీసీలు అవిశ్వాసం ప్రకటించినవారిలో ఉన్నారు. మండలంలో మొత్తం 9 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ఎంపీటీసీ సున్నం సురేశ్ మాట్లాడుతూ నాలుగేళ్ల వరకు ప్రస్తుత ఎంపీపీ కొర్స పోశమ్మ పదవిలో ఉండేలా నియమించుకున్నామన్నారు. నాలుగేళ్లు పూర్తయినా ఆమె పదవి నుంచి తొలగక పోవడంతో ఆమెపై మెజార్టీ ఎంపీటీసీలు అవిశ్వాసం ప్రకటించారు. ఈ విషయమై ఆర్డీవో కార్యలయం, ఎంపీడీవోలకు వినతిపత్రం అందజేసిన వారిలో ఉప్పల లలిత కుమారి, పి.నాగమణి, కె.సుధారాణి, ఎం.వెంకటలక్ష్మి ఉన్నారు.

రేపు, ఎల్లుండి గాంధీ జయంతి కార్యక్రమాలు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబరు 1, 2 తేదీల్లో ఉత్సవాలను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. ఒకటో తేదీన ఉదయం 10గంటలకు భీమవరంలోని గాంధీ కస్తూరిబా భవనంలో ఫోటో ఎగ్జిబిషన్, యువతకు అవగాహన కార్యక్రమం, 2న ఉదయం పెదనింద్రకొలనులోని మహాత్మాగాంధీ భవనంలో గాంధీజీకి నివాళులు, సర్వమత ప్రార్థనలు, శాంతి ప్రతిజ్ఞలు, గాంధేయవాదులకు పురస్కారాల అందజేత కార్యక్రమాలు, మధ్యాహ్నం 2గంటల నుంచి మల్లవరం ఆనందనికేతన్ గాంధీ ఆశ్రమానికి శాంతిసేన ర్యాలీ, గాంధేయవాదులకు, సేవాతత్పరులకు గాంధీస్మారక పురస్కారాలు అందజేత కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

రేపు కలెక్టరేట్‌లో మహిళా ఉద్యోగులకు వైద్య పరీక్షలు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ-స్వశక్త్ అభియాన్ కార్య క్రమం కింద అక్టోబరు 1న ఏలూరు కలెక్టరేట్‌లో మహిళా ఉద్యోగులు, వారి కుటుంబంలోని మహిళలకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహిస్తారని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో వైద్యశిబిరం నిర్వహణపై చర్చించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ వెయిటింగ్ హాలులో ఉదయం 10గంటలకు వైద్యశిబిరం ప్రారంభమవుతుందని, మహిళా ఉద్యోగులతోపాటు, పురుష ఉద్యోగుల కుటుంబాల్లోని మహిళలకు కూడా వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై ప్రజల్లో అవగాహన


దుకాణాల వద్ద ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

జీలుగుమిల్లి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం దేశ వ్యాప్తంగా సూపర్ జీఎస్టీ సూపర్‌లో భాగంగా జీఎస్టీ తగ్గించడంతో ప్రభుత్వ అధికారులు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఈ క్రమంలో పశువైద్యశాఖ జీలుగుమిల్లి ఏడీ పి.సాయి బుచ్చారావు మాట్లాడుతూ పశుసంవర్థక రంగానికి ఉపశమనం కల్పించిందన్నారు. పలు కిరాణా దుకాణాల వద్ద సివిల్ సప్లయీస్ డీటీ ఎస్.వి.రమణ జీరో జీఎస్టీ గురించి ప్రకటించారు.

మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం



జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి అధ్యక్షతన సోమవారం జరిగింది. కౌన్సిలర్లు తమ వార్డులోని ప్రధాన సమస్యలు కౌన్సిల్ దృష్టికి తీసు కొచ్చారు. కౌన్సిలర్ తాతాజీ రోడ్లు, వీధి దీపాల సమస్యల గురించి తెలిపారు. కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని సభ్యులు కోరారు. అందుకు కమిషనర్ కె.వి.రమణ మాట్లాడుతూ ఇప్పటికే పట్టణంలో కుక్కల సంతానాభివృద్ధి జరగకుండా ఆపరేషన్లు చేశామన్నారు. అనంతరం 33 అంశాలను సభ్యుల ముందుంచగా కౌన్సిల్ ఆమోదించినట్లు కమిషనర్ తెలిపారు.ఈ సమావేశంలో వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, కౌన్సిలర్లు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల అభివృద్ధికి రుణాలు : ఎమ్మెల్యే చంటి



ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి):: చిరువ్యాపారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఆర్థిక సహాయ అందిస్తున్నట్టు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో వీధి వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ వీధివ్యాపారులకు ఒక్కొక్కరికి రూ.15వేలు ఆర్థిక సహాయం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అందిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని వీధివ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నగర పాలక సంస్థ కమిషనర్ ఏ.భానుప్రతాప్, కోఆప్షన్ సభ్యులు పెదబాబు, మెప్మాపీడీ మాధవి, ఎల్‌డీఎం నీలాద్రి, మెప్మా కోఆర్డినేటర్ సీహెచ్ మహాలక్ష్మి, సీఎంఎం ఝాన్సీరాణి, డాక్టర్లు కే.రామ్, డాక్టర్ సంతోశ్, మానవత సభ్యులు కుమార్, ఎస్.అజయ్‌బాబు పాల్గొన్నారు.

స్వానిధి రుణాలు సద్వినియోగం చేసుకోండి : రమణ


జంగారెడ్డిగూడెం: చిరువ్యాపారుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో స్వానిధి రుణాలు మంజూరు చేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ కె.వి.రమణ తెలిపారు. సోమవారం స్థానిక రోటరీ కమ్యూ నిటీ హాల్లో లోక్ కల్యాణ్ మేళా నిర్వహించారు. కమిషనర్ కె.వి.రమణ మాట్లా డుతూ ప్రస్తుతం ఎస్‌యూఎల్ఎం 2.0లో భాగంగా రూ.15 వేలు, 25 వేలు, 50 వేల వరకు రుణాలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. ఐసీడీఎస్, సీడీపీవో పి.బ్యూలా, ఎస్‌బీఐ, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజర్లు, మెప్మా టీఎంసీ కె.నాగమణి పాల్గొన్నారు.

నకిలీ మందులకు చెక్!

(5వ పేజీ తరువాయి)

రద్దు చేయడం, ఫైన్‌లు విధించడం చేస్తున్నామని ఏలూర డ్రగ్ ఇన్స్‌పెక్టర్ ఎం.విక్రమ్ తెలిపారు. క్యూఆర్ కోడ్ అనేది అమ్మేవారికి, కొనేవారికి ఉపయుక్తమేనని, తొలి విడతగా 300 రకాల పైనే క్యూఆర్ కోడ్ విధిగా ఉంచాలన్న ప్రభుత్వ ఆదేశాలతో తాము మరింత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

క్యూఆర్ కోడ్‌తో ఉపయోగమే..



ఉమా మెడికల్స్ రిటైల్ షాపు యజమాని శర్మ, ఏలూరు

మందులకు క్యూ ఆర్ కోడ్ అమలు చేయడం మాకు ఉపయోగమే. ఎక్కడకక్కడ నకిలీలను అధిగమించడానికి ఆస్కారం ఉండనుంది. టాబ్లెట్ స్ట్రిప్‌లపై క్యూ ఆర్ కోడ్ నమోదు ఇంకా పూర్తిగా జరగలేదు. ఒకటో, రెండో కంపెనీల నుంచి క్యూఆర్ కోడ్ పద్ధతి కనిపిస్తున్నాయి.


జీలుగుమిల్లిలో పూజలు చేస్తున్న రవికుమార్


ఏలూరులో దుర్గమ్మకు సరస్వతీ అలంకరణ


బావిశెట్టివారిపేటలో కనకదుర్గాంబను దర్శించుకుంటున్న ఘంటా పద్మశ్రీ


మాదేపల్లిలో భ్రమరాంబ దేవి


జంగారెడ్డిగూడెంలో అమ్మవారికి అలంకరణ

ఘనంగా దసరా వేడుకలు

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు డివిజన్లలోని అమ్మవారి ఆలయాల వద్ద జరుగుతున్న దేవీనవరాత్రులు సోమవారం ఎనిమిదవ రోజుకు చేరుకున్నాయి. శుద్ధ సప్తమి మూలా నక్షత్రం నేపథ్యంలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించగా భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పలు ఆలయాల వద్ద విద్యార్థులు సామూహికంగా సరస్వతీ పూజలు నిర్వహించారు. సత్రంపాడులోని అంబికాదేవి అమ్మవారిని, సౌభాగ్యలక్ష్మీదేవి అమ్మవారిని, పత్తేబాదలో కనకదుర్గమ్మను, సత్యనారాయణపేటలోని పార్వతీదేవిని, బావిశెట్టివారిపేటలోని కనకదుర్గాంబను, దక్షిణపువీధిలోని మహిషాసుర మర్ధిని అమ్మవారిని, బాలాత్రిపుర సుందరీదేవిని, కన్యకాపరమేశ్వరిని, రాజ్యలక్ష్మీ దేవిని, పవరుపేటలోని కాశీ అన్నపూర్ణాదేవిని, లక్ష్మీదేవి అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. బావిశెట్టివారిపేటలోని కనకదుర్గాంబను జడ్పీ చైర్ పర్సన్ దంపతులు ఘంటా పద్మశ్రీ, ప్రసాదరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయగా ఆలయ ఈవో సి.హెచ్.చిన నాగేశ్వరరావు, ఆలయ అర్చకులు యడవల్లి శ్రీహరిశర్మల బృందం ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి అనురాధ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు జడ్పీ చైర్‌పర్సన్ దంపతులను సత్కరించారు. కార్యనిర్వహణాధికారి సిహెచ్ చిన్నానాగేశ్వరరావు, కార్పొరేటర్ కలకొల్లు సాంబ, అశోక్ రాజ్‌లు పాల్గొన్నారు.

సరస్వతీ దేవిగా అమ్మవార్లు దర్శనం

● భీమడోలు: మండలంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. భీమడోలు ఏలూరువ కాలువ గట్టుపై ఉన్న శ్రీకనకదుర్గాదేవిని సరస్వతీదేవిగా అలంకరించి పూజలునిర్వహించారు. అమ్మవారికి దాతలు కరణం నాగేశ్వరరావు, కొప్పెల్ల వెంకటలక్ష్మణావు, బంద్రెడ్డి రాధాకృష్ణ, వెండి ఆభరణాలు, ఇన్వర్టర్ బహూకరించారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు వుడతల శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: స్థానికంగా ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారు సోమవారం సరస్వతీ దేవి అలంకరణలో ప్రజలకు దర్శనమిచ్చారు. దీంతో భక్తులు ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు.

● కామవరపుకోట: స్థానిక లక్ష్మీహయగ్రీవ లలితాశ్రీ పీఠంలో పీఠం వ్యవస్థాపకులు సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు(దుర్గబాబు),సత్య శ్రీనివాసాచార్యులు పూజలు జరిపించారు. తడికలపూడి, ఆడమిల్లి, కళ్ళచెరువు, జీలకర్రగూడెం, రావికంపాడు తదితర గ్రామాల్లో సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

● జీలుగుమిల్లి: జగదాంబ అమ్మవారి దసర శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పి.ప్రసాద్, కె.చిరంజీవిశర్మలు సమస్రనామార్చనలతో కుంకు పూజలు జరిపించారు. అనంతరం ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేసి సరస్వతి పూజ నిర్వహించారు.


ఏలూరులో సామూహిక పూజలు చేస్తున్న చిన్నారులు

● ఏలూరుటూటౌన్: అఖండ జ్ఞాన, సిరులను అందించే శ్రీసరస్వతిదేవి అనుగ్రహంతో ప్రజలపై ఉండాలని ఎమ్మెల్యే బడేటి చంటి ఆకాంక్షించారు. శరన్నవరాత్రుల్లో భాగంగా దక్షిణపువీధిలోని శ్రీగంగాపార్వతి సమేత జరుపహరేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే బడేటి చంటి, మీనా దంపతులు, మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు దంపతులు పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు జయేంద్రశర్మ, ఇడా చైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, కోఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: రూరల్ మండలం మాదేపల్లి గ్రామంలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో అమ్మవారు సరస్వతి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్తలు విద్యార్థులకు పుస్తకాలు పెన్నులు పంపిణీ చేశారు. ఆలయ అర్చకులు కృష్ణ చైతన్యశర్మ అమ్మవారికి పూజలు నిర్వహించారు.

కుల వివక్షను నిర్మూలించాలి

లింగపాలెం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కుల వివక్షనిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించాలని, ఎదుటి వారి హక్కులకు భంగం కలిగించకూడదని తహసీల్దార్ నజీముల్లాషా అన్నారు. మండలంలోని గణపనేనివారిగూడెంలో పౌరహక్కులపై అవగాహన కల్పించారు. వర్గ విభేదాలు లేకుండా సోదరభావంతో జీవించాలన్నారు.ఎంఈవో కె.రామారావు, డీటీ నాగబాబు, సర్పంచ్ డి.రవీంద్ర పాల్గొన్నారు.

సత్యశోధక్ ఆవిర్భావ వారోత్సవం..

బుట్టాయగూడెం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడుతామని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ధర్ముల సురేశ్ పిలుపునిచ్చారు. సోమవారం హైస్కూల్ ఆవరణలో పీడీఎస్‌యు నాయకుడు బన్నె వినోద్ అధ్యక్షతన జరిగిన మహాత్మ జ్యోతిరావుపూలే స్థాపించిన సత్యశోధక్ 153వ ఆవిర్భావ వారోత్సవం నిర్వహించారు. అంటరానితనం, కులవివక్షత, లింగ అసమానతలకు వ్యతిరేకంగా పూలే పోరాడారని గుర్తు చేశారు.



బెజవాడ దుర్గమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే ప్రభాకర్ దంపతులు

పెదవేగి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, వెంకట రాధారాణి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చింతమనేని ప్రభాకర్ దంపతులకు వేదపండితులు వేదాశీర్వాదం అందించి, తీర్థప్రసాదాలు, అమ్మవారి చిత్ర పటాన్ని అందించి, శేషవస్త్రంతో సత్కరించారు. పెదవేగి మండలం రాట్నాలకుంట శ్రీరాట్నాల మ్మవారి సన్నిధిలో చిన్నారులతో సామూహికంగా సరస్వతీదేవి పూజలు చేయించారు. పెదవేగి బీసీ కాలనీలో అమ్మవారి సన్నిధిలోనూ సామూహిక పూజలు నిర్వహించారు.


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిర్రి

మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యం

బుట్టాయగూడెం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. సోమవారం బుట్టాయగూడెం సమాజిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు జరిపి మందులు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలించారు. ఆసుపత్రి సూపర్నెంట్ వసుంధర, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఆశ్రం వైద్యులు

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): వ్యాయమం ద్వారా గుండెను పరిరక్షించుకోవచ్చని ఆశ్రం ఆస్పత్రి కార్డియాలజిస్ట్ డాక్టర్ ఐవీఆర్. తమ్మిరాజు అన్నారు. ప్రపంచ హార్ట్‌డేను పురస్కరించుకుని ఆశ్రం ఆస్పత్రిలో వాక్‌థాన్ నిర్వహించారు. ఎస్పీ కేపీఎస్ కిషోర్ ముఖ్య అతిథిగా హాజరయ్యి ర్యాలీని ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యం దృష్ట్యా ఆశ్రం ఆసుపత్రి పరిధిలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.డాక్టర్ తమ్మిరాజు మాట్లాడుతూ వ్యాయామానికి కొంత సమయం కేటాయించాలన్నారు. ఆశ్రం సీఈఓ డాక్టర్ కే.హనుమంతరావు, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు కృష్ణ మోహన్, ఐఎంఆర్ మధుబాబు,అక్బర్, సీవోవో రాజు రాజన్, సూపరింటెండెంట్ డాక్టర్ శాంతయ్య, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్ గౌతమ్, వైస్ ప్రిన్సిపల్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఎస్టీ సర్టిఫికెట్లు ఇవ్వండి మహాప్రభో

కామవరపుకోట, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): తమకు ఎస్టీ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద కొండగూడేనికి చెందిన నాయక సామాజిక వర్గం చేస్తున్న ఆందోళనలు సోమవారం నాటికి ఎనిమిదవ రోజుకు చేరుకున్నాయి. ఎస్టీ సర్టిఫికెట్లు ఇవ్వాలంటూ నినాదాలతో హోరెత్తించారు.తమ కుటుంబాలకు గతంలో ఎస్టీ సర్టిఫికెట్లు ఇచ్చి ఇప్పుడు ఎందుకివ్వరంటూ ఆక్రోశాన్ని వ్యక్తం చేశారు. సర్టిఫికెట్‌లు ఇచ్చేవరకు ఆందోళన విరమించేదిలేదని స్పష్టం చేశారు. పెద్ద సంఖ్యలో నాయక సామాజిక వర్గం మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.



'పొగాకు రైతుల సంక్షేమానికి కృషి'

టి.నర్సాపురం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తానని మక్కినవారిగూడెం సొసైటీ చైర్‌పర్సన్ ఆచంట సూర్యనారాయణ తెలిపారు. స్థానిక సొసైటీ ఆవరణలో మహా జనసభ చైర్మన్ ఆచంట సూర్యనారాయణ అధ్యక్షతన సోమవారం జరిగింది. పొగాకు రైతుల సౌకర్యార్థం గొడౌన్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. సీఈవో యూవీవీ సత్య నారాయణ సంఘ వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. సర్పంచ్ మెతుకుమిల్లి గోపాలరావు, సొసైటీ పర్సన్‌లు నరడల సత్యనారాయణ, దాసరి వెంకటలక్ష్మి, పలువురు రైతులు పాల్గొన్నారు.



సొసైటీ అభివృద్ధికి సహకరించండి

టి.నర్సాపురం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): టి.నర్సాపురం సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని చైర్మన్ జోనుబోయిన సోంబాబు తెలిపారు. స్థానిక సంఘ సహకార రైతు రత్న ప్రాంగణంలో చైర్‌పర్సన్ సోంబాబు అధ్యక్షతన సొసైటీ మహాజన సభ సోమవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో రుణాలు చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలన్నారు.మోదుగ వెంకట రామారావు, ఉయ్యూరి నాగమణి, ముఖ్య కార్య నిర్వహణ అధికారి ఎం.అగస్టీన్ పాల్గొన్నారు.

'రైతులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం'



ద్వారకాతిరుమల, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డుల్లో రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి గిట్టుబాటు ధర వచ్చేలా చేయడమే ప్రభుత్వ ధ్యేయమని గోపాలపురం ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు అన్నారు. ద్వారకాతిరుమలలోని నిమ్మకాయల మార్కెట్ యార్డును ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన రైతులు, కమిషన్ వ్యాపారులతో మాట్లాడి రైతులను అన్నివిధాల ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ పోలిన శ్రీనివాసరావు, జి.కొత్తపల్లి సొసైటీ చైర్మన్ రేగంటి రాంబాబు, నేతలు మొగతడకల ఓం ప్రకాశ్ చౌదరి, పోతన ధర్మరాజు, ఏపూరి కిశోర్ పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠను పెంపొందించండి


సభలో పాల్గొన్న ఎమ్మెల్యే చింతమనేని, పాలకవర్గం

పెదపాడు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): అభయాంజనేయస్వామికి సేవ చేసే భాగ్యం లభించడం ఎంతో అదృష్టమని, ఆలయ ప్రతిష్ట మరింత విస్తరించేలా కృషి చేయాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పేర్కొన్నారు. అప్పనవీడు అభయాంజనేయ స్వామి దేవాలయ చైర్మన్‌గా వేమూరి శ్రీనివాసరావు, 10 మంది పాలకవర్గ సభ్యులతో ఎమ్మెల్యే చింతమనేని సోమవారం ప్రమాణ స్వీకారం చేయించి అభినందించారు. తొలుత స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరో ముఖ్య అతిథి ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణ(చంటి) మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులతో బాధ్యతలు చేపట్టిన మీరంతా భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించాలన్నారు. ప్రమాణ స్వీకారోత్సవంలో భాగంగా పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు విక్రంకిశోర్, ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, కనకదుర్గ అమ్మవారి బోర్డు సభ్యురాలు మోరు శ్రావణి, విజయడెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు, చలమలశెట్టి రమేష్, గుత్తా అనిల్, మరడాని రవి, లావేటి శ్రీనివాసరావు, దేవాలయ ఇనస్పెక్టర్ బాబు నాయుడు, ఈవో పి.తారకేశ్వరరావు పాల్గొన్నారు.

మంత్రి కొలుసు అభినందన : పాలకవర్గ చైర్మన్ వేమూరి శ్రీనివాసరావుతో పాటు పాలకవర్గ సభ్యులకు గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్, వీహెచ్‌పీ నేషనల్ ట్రస్టీ పుట్టగుంట సతీశ్ కుమార్‌లు అభినందనలు తెలిపారు. వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

టి.నర్సాపురం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మహిళలు ప్రత్యేక వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని మల్లుకుంట సొసైటీ చైర్ పర్సన్ శీలం సాయివినయ్ తెలిపారు. వెలగపాడు పంచాయతీలో స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా ఉచిత మెగా వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చైర్మన్ శీలం సాయివినయ్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. సర్పంచ్ జలపాలు, జాజుల గిరి, జోనుబోయిన భాష, చింతపల్లి సిద్ధిరాజు, తుమ్మల శ్రీను, నరదల పిచ్చేశ్వరరావు, పాకనాటి అంజి, దూపకుంట్ల నాని పాల్గొన్నారు.

వెలమపేటలో 320 మందికి పరీక్షలు...

చింతలపూడి: నగర పంచాయతీలోని వెలమపేటలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ వైద్య శిబిరంలో 320 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని అర్బన్ హెల్త్ సెంటర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సొంగా యేసుపాదం ప్రారంభించారు. డాక్టర్ హరీష్ వైద్య పరీక్షలు జరిపారు. తాటి అప్పారావు, సొసైటీ అధ్యక్షులు తిరుమిల్లి రామారావు, 104 ఆరోగ్య సిబ్బంది, ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్ఐగా అద్దేపల్లి శివ



ఏలూరురూరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఏలూరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా అద్దేపల్లి శివ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ ఆర్ఐగా బాధ్యతలు నిర్వహించిన నాయక్ కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లారు. శివ జిల్లా పౌర సరఫరాల శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఏలూరు అర్బన్ రెవెన్యూ కార్యాలయంలో ఆర్ఐగా ఆయన బాధ్యతలు తీసుకున్నారు.


శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ నర్సమాదేవిరాయుడుబాబు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాజుపాలెం సర్పంచ్ దేవరపల్లి నర్సమాదేవి రాయుడుబాబు అన్నారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు కృషితో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన రాజుపాలెంలో ఉపాధి నిధులతో నిర్మించనున్న మ్యాజిక్ డ్రైన్లకు ఆమె శంకుస్థాపన చేశారు. మాజీ జడ్పీటీసీ డి.వి.చౌదరి ముఖ్య అతిథిగా హాజరవగా టీడీపీ సీనియర్‌నేత దేవరపల్లి రాయుడుబాబు, హేమంత్, వేములయ్య, బుల్లియ్య, ఏసురాజు పాల్గొన్నారు.


చౌదరి దంపతులను సన్మానిస్తున్న జడ్పీ చైర్ పర్సన్

ఇంజనీర్ చౌదరికి ఉద్యోగ విరమణ సత్కారం

దెందులూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): 42 ఏళ్లుగా పంచాయతీరాజ్ శాఖలో ఇంజనీరింగ్ అధికారిగా పనిచేసిన చౌదరికి సన్మాన సభ ఘనంగా జరిగింది. ఉత్తమ ఇంజనీరింగ్‌గా పంచాయతీ రాజ్ శాఖలో నీతి నిజాయితీలతో వివిధ హోదాల్లో దెందులూరు, పెదవేగితో పాటు పలు మండలాల్లో పంచాయతీరాజ్ శాఖ అధికారిగా జీఎస్‌వీఆర్ చౌదరి పని చేశారు. సోమవారం జడ్పీ మీటింగ్ హాల్లో పంచాయతీ ఇంజనీరింగ్, కాంట్రాక్టర్స్ మండల సిబ్బంది ఉద్యోగుల ఆధ్వర్యంలో జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ప్రసాదరావు దంపతులు ఉద్యోగ విరమణ సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ చేసిన చౌదరి, జయలత దంపతులు ఆయురారోగ్యాలతో కలకాలం జీవించాలని ఆకాంక్షిస్తూ గజ మాల, శాలువాతో సన్మానించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొయ్యలగూడెం, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): కన్నాయిగూడెం, కన్నాపురం, ఫీడర్లకు మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ అహ్మద్ ఖాన్ తెలిపారు. ఉదయం 12 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు తెలిపారు. రైతులకు ఉదయం 7నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 6గంటల వరకు విద్యుత్ ఉంటుందని తెలిపారు.

రైతాంగాన్ని ఆదుకోవాలి : సీపీఐ

కుక్కునూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): గోదావరి వరదలకు కుక్కునూరు మండలంలో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి కొన్నే లక్ష్మయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కుక్కునూరులో జరిగిన కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ వరదల కారణంగా రైతులు పంటలు కోల్పోయారని అన్నారు.నష్టపోయిన రైతుకు ఎకరాకు రూ.50 వేలు అందించాలని కోరారు. జిల్లా సమితి సభ్యులు ఐతా సురేశ్‌బాబు, వరకా శ్యామలా, కె.బాబూరావు, వి.పాపారావు పాల్గొన్నారు.

విజయవంతంగా స్త్రీ శక్తి అమలు

ఏలూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్త్రీశక్తి పథకం ద్వారా ఉచిత బస్సులను విజయవంతంగా నడపటంలో ప్రజారవాణా సంస్థ (ఆర్టీసీ) కండక్టర్లు, డ్రైవర్లు, ఉద్యోగులు, మెకానిక్ సిబ్బంది విశేష కృషి చేస్తున్నారని జిల్లా ప్రజా రవాణాధికారి(డీపీటీవో) షేక్ షబ్బం అభినందించారు. ఏలూరు గ్యారేజ్‌లో కార్మికుల అభినందన సభ డీఎం వాణి ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా షబ్బం మాట్లాడుతూ ఆగస్టు 15వ తేదీ నుంచి ప్రారంభించిన ఉచిత బస్సు ప్రయాణాల్లో ఎటువంటి ఇబ్బందికర పరిస్థితులు లేకుండా సజావుగా సాగుతోందన్నారు.

టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్‌గా రజనీకుమారి

ఏలూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మెప్మా ఏలూరు టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్‌గా కె.రజనీ కుమారి నియమితులయ్యారు.రాష్ట్ర పురపాలక శాఖలో ప్రాజెక్టు ఆఫీసర్ గ్రేడ్ -2 నుంచి గ్రేడ్-1 ఆఫీసర్‌గా పదోన్నతి కల్పించి బదిలీ చేస్తూ అధికారులు సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు.

భవానీలకు అల్పాహారం అందజేత

దెందులూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ దర్శనానికి జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్న భవానీలకు గోపన్నపాలెం గ్రామానికి చెందిన శ్రీదేవి శ్రీవల్లి ప్రమోటర్స్ అధినేత కొండేటి మనోహర్ (నాని) గ్లూకోజ్, పండ్లు, అల్పాహారం అందజేశారు. సుమారు 800 మంది భవానీలకు సంస్థ వ్యవస్థాపకులు కొండేటి రాంబాబులతో కలిసి పండ్లు పంపిణీ చేశారు.


శిక్షణ శిబిరం నిర్వహిస్తున్న అధికారులు

జీఎస్టీపై అధికారులకు శిక్షణ

పోలవరం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జీఎస్టీ 2.0పై మండల అధికారులకు ప్రత్యేక అధికారి ప్రభాకర్ సోమవారం అవగాహనా శిక్షణను నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి జీఎస్టీపై అవగాహన కల్పిస్తామన్నారు. తహసీల్దారు బి. సాయిరాజు, ఎంపీడీవో మణికుమారి, వ్యవసాయాధికారి కె.రాంబాబు పాల్గొన్నారు.


జీఎస్టీ తగ్గుదల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కామినేని తదితరులు

20 మంది రక్తదానం

మండవల్లి: లింగాలలో సేవా పక్షోత్సవాలలో భాగంగా కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ సూచన మేరకు మండవల్లి మండల బీజేపీ అధ్యక్షుడు బోయిడి సురేష్‌బాబు ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని చాపరాల దుర్గాప్రసాద్ ప్రారంభించగా, బీజేపీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ సమయం ఏసుబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు. 20 మంది సభ్యులు రక్తదానం చేశారు.

ఆక్వా రైతులు అప్సడా అనుమతులు తీసుకోవాలి : కామినేని

కైకలూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆక్వా చెరువులు ప్రజల జీవన విధానమని, ప్రతి ఎకరానికి అప్సడా అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ వర్తించేలా అప్సడా రిజిస్ట్రేషన్ దరఖాస్తు విధానంపై అవగాహన సదస్సును కైకలూరులోని ఓ ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అప్సడా పై అవగాహన పెంచుకోవాలన్నారు. మత్స్యశాఖ జేడీ లాల్ మహ్మద్ మాట్లాడుతూ అప్సడా అనుమతులు ఉంటేనే విద్యుత్ సబ్సిడీ వర్తిస్తుందన్నారు. గ్రామ మత్స్యశాఖ అధికారి ద్వారా అనుమతులు మంజూరు చేసుకోవచ్చని సూచించారు. అనుమతుల కోసం ఎకరానికి రూ.వెయ్యి, ఎకరం పైన ఒక్క సెంటు ఉన్నా రూ.2వేలు ప్రభుత్వానికి ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా ఆన్‌లైన్ పేమెంట్ చేయాలన్నారు. ఏ అధికారి చేతికి నగదు ఇవ్వవద్దని సూచించారు. జిల్లాలో 1,65,000 ఎకరాల్లో ఆక్వాసాగు ఉందని ఇందులో కైకలూరు నియోజకవర్గంలో 85 వేల ఎకరాల్లో సాగు జరుగుతుందన్నారు. అక్టోబరు 18వ తేదీ లోపు ఈ దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జీఎస్టీ తగ్గుదల వల్ల ఆక్వా రంగానికి కలిగిన ఉపయోగాలపై కరపత్రాలను ఆవిష్కరించారు. ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, జిల్లా మత్స్యశాఖ అధికారి నరసయ్య, విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీబీ శ్రీనివాస్, కైకలూరు మత్స్యశాఖ ఏడీ రవికుమార్, పలువురు నేతలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం : కామినేని

కలిదిండి: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కామినేని అన్నారు. సోమవారం కలిదిండిలో రూ.74 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అంతర్గత రహదారులపైకి మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. కలిదిండి ఎస్‌బీఐ వద్ద బీజేపీ నాయకులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. తాడినాడ బాబును పరామర్శించారు.


ఆలయ పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంత్రి సారథి

ఆలయ అభివృద్ధికి పాటుపడాలి : మంత్రి

నూజివీడు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి రఘునాథస్వామి ఆలయ పునః నిర్మాణానికి కృషి చేస్తానని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. సోమవారం రఘునాథస్వామి ఆలయ పాలకవర్గంతో మంత్రి ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్‌గా వరుగు నీలిమ ఎన్నిక కాగా పాలకవర్గ సభ్యులుగా తుట్టగుంట బాల వెంకటరమణ, బండారు లక్ష్మి, గోగినేని వాణి, కొలుసు మాధవి, బొచ్చు నరసింహారావు, దొండపాటి నాగరాజు, బోనాల శ్రీనివాస రావు, నక్కా శ్రీనివాసరావు, గండికోట రామకృష్ణ, గోగినేని విజయ్‌గోపాల్‌తో మంత్రి ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ అభివృద్ధికి కృషిచేయాలన్నారు. నూజివీడు మాజీ ఏఎంసీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు, మాజీసర్పంచ్ పొట్లూరి సత్యనారాయణ, వెంకట్రావు పలువురు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

● అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను జోడు గుర్రాల్లా సీఎం చంద్రబాబు పరుగులు పెట్టిస్తున్నారని మంత్రి అన్నారు. నూజివీడు మండలం గొల్లపల్లి గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రహదారిని ఆయన ప్రారంభించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

పోలీసుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయొద్దు

దూలం వ్యాఖ్యలపై ఏఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పోలీసులపై అవాస్తవ, నిరాధార వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు జిల్లా ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు హెచ్చరించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఏఎస్పీ, జిల్లా పోలీసు అధికారుల సంఘ జిల్లా అధ్యక్షుడు ఆర్.నాగేశ్వర రావు మాట్లాడుతూ ఈ నెల 5న కైకలూరు దాన గూడెంలో రెండు సామాజికవర్గాలు మధ్య వినాయక నిమజ్జనంలో ఘర్షణలు చెలరేగా యని ఈ ఘటనలో దానగూడెం గ్రామ దళితు లపై దాడి ఘటనపై పోలీసులు కేసులు నమోదు చేసి అరెస్టులు చేశారన్నారు. ప్రస్తుతం నిందితులు మచిలీపట్ట ణం జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్నా రన్నారు. ఈనెల 26న కైకలూరు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు విలే కరుల సమావేశంలో మాట్లాడుతూ దాన గూ డెం సంఘటనలో కైకలూరు రూరల్ సీఐ వీరా రవికుమార్‌పై వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేశా రన్నారు. నోటికి వచ్చినట్లు మాట్లాడితే సహిం చేది లేదన్నారు. గతంలో ఎమ్మెల్యేగా పని చేసిన అయనకు ఎవరి అధికారాలు ఏమిటో తెలియక పోవడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. సీఐలను బదిలీలు చేసే అధి కారం పోలీసు ఉన్న తాధికా రులకే ఉంటుందని, ఎమ్మెల్యే లకు ఉండద న్నారు. పోలీసు లపై దూలం నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలు పోలీసుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని, బహిరంగ క్షమా పణ చెప్పాలని డిమాండ్ చేశారు. దాన గూడెం సంఘటన జరిగిన సమయంలో పోలీ సు అధికారులు యుద్ధ ప్రాతి పదికన సమయ స్ఫూర్తి తో వ్యవహరించి శాంతి భద్రత లను కాపా డారన్నారు. మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరా వుపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. సీఐ కృష్ణ మాట్లాడుతూ తనను సాధారణ బదిలీల్లో మాత్రమే బదిలీ చేశారని ఎవరి బలవంతంగా వీఆర్‌కు తరలించలేదని స్పష్టం చేశారు.

నకిలీ మందులకు చెక్!

(5వ పేజీ తరువాయి)

రద్దు చేయడం, ఫైన్‌లు విధించడం చేస్తున్నామని ఏలూర డ్రగ్ ఇన్స్‌పెక్టర్ ఎం.విక్రమ్ తెలిపారు. క్యూఆర్ కోడ్ అనేది అమ్మేవారికి, కొనేవారికి ఉపయుక్తమేనని, తొలి విడతగా 300 రకాల పైనే క్యూఆర్ కోడ్ విధిగా ఉంచాలన్న ప్రభుత్వ ఆదేశాలతో తాము మరింత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

క్యూఆర్ కోడ్‌తో ఉపయోగమే

ఉమా మెడికల్స్ రిటైల్ షాపు యజమాని శర్మ, ఏలూరు

మందులకు క్యూ ఆర్ కోడ్ అమలు చేయడం మాకు ఉపయోగమే. ఎక్కడకక్కడ నకిలీలను అధిగమించడానికి ఆస్కారం ఉండనుంది. టాబ్లెట్ స్ట్రిప్‌లపై క్యూ ఆర్ కోడ్ నమోదు ఇంకా పూర్తిగా జరగలేదు. ఒకటో, రెండో కంపెనీల నుంచి క్యూఆర్ కోడ్ పద్ధతి కనిపిస్తున్నాయి.